RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 351 బుధవారం 14 జనవరి 2026 పేజీలు : 4 వెల : రూ. 2.00

## 10 వేల కోట్లతో క్షిపణుల కొనుగోలు

న్యూఢిల్లీ : గగనతలాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చడానికి మనదేశం వేగంగా అడుగులు వేస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్ దాడులను సమర్థంగా తిప్పికొట్టిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థను మరింత విస్తరించ డానికి సిద్ధమైంది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) దీనిని ఓ గేమ్‌చేంజర్‌గా అభివర్ణిస్తున్న నేపథ్యంలో మరో ఐదు ఎస్-400లను కొనుగోలు చేయనున్నారు. డిసెంబరు 5న జరిగే ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీలో వీటితో పాటు మరిన్ని క్షిపణుల కొనుగోలుకు ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. అలాగే రూ. 63 వేల కోట్లతో సుఖోయ్-30ఎంకేఐ యుద్ధవిమానాల ఆధునీకరణ కార్యక్రమానికి కూడా భారత్ సిద్ధమవుతోందని టైమ్స్ ఆఫ్ ఇండియా తన కథనంలో తెలిపింది. ఆ కథనం ప్రకారం.. మరిన్ని ఎస్-400 స్క్వాడ్రన్‌లు కొనుగోలుకు ఇప్పటికే రక్షణ శాఖ సిద్ధమైంది. అలాగే పాక్‌తో యుద్ధం సమయంలో తరిగిపోయిన నిల్వలను మళ్లీ పెంచడానికి ఎస్-400 క్షిపణులను కూడా కొనుగోలు చేయాలని నిర్ణయించింది.




# త్రిముఖ వ్యూహంతో రేవంతుడు!

## జిల్లాల పర్యటనలకు స్పష్టమైన రోడ్‌మ్యాప్ రెడీ!!

హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనలకు స్పష్టమైన రోడ్‌మ్యాప్ ఖరారైంది. ఈసారి పర్యటనను త్రిముఖ వ్యూహంతో నిర్వహించనున్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, అలాగే ఉపాధి హామీ పథకం అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన సభలు నిర్వహించడమే ఈ వ్యూహంలోని ప్రధాన అంశాలు. ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల వారీగా రెండు దఫాల పర్యటన షెడ్యూల్‌ను సీఎం ఖరారు చేశారు. బహిరంగ సభలతో పాటు వీలున్న చోట్ల కార్నర్ మీటింగ్లు నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు.

**జనవరి 16 నుంచి తొలి విడత పర్యటన...** మొదటి విడత జిల్లాల పర్యటనను ఈ నెల 16 నుంచి ప్రారంభించనున్నారు. జనవరి 16, 17, 18 తేదీల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో సీఎం పర్యటించనున్నారు. ఈ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నారు. నిర్మల్, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలకు కూడా హాజరవుతారు. జనవరి 16న నిర్మల్‌లో, 17న జడ్చర్లలో, 18న పాలేరు-ఖమ్మం ప్రాంతంలో సీఎం పర్యటన కొనసాగనుంది. అదే సమయంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని కూడా వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు.

**విదేశీ పర్యటన షెడ్యూల్...** జనవరి 19న సీఎం మేడారం వెళ్లనున్నారు. అనంతరం అదే రోజు సింగపూర్, అమెరికా దేశాల పర్యటనకు బయలుదేరనున్నారు. ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. మరుసటి రోజు పరిస్థితిని బట్టి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

**ఫిబ్రవరి 3 నుంచి మలి విడత...** ఫిబ్రవరి 3 నుంచి రెండో విడత జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ విడతలో ఆరు రోజుల పాటు ఆరు ఉమ్మడి జిల్లాల్లో సీఎం పర్యటించనున్నట్లు సీఎంవో వర్గాలు వెల్లడించాయి. వరుసగా నల్లగొండ, కరీంనగర్, రంగారెడ్డి, వరంగల్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో కూడా తొలి విడత తరహాలోనే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, అధికారిక కార్యక్రమాలు, పార్టీ కార్యకర్తలతో సమావేశాలు ఉంటాయి. కార్నర్ మీటింగ్లు, బహిరంగ సభల ద్వారా మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనున్నారు.

**ఉపాధి హామీపై నిరసన సభలు...** ఉపాధి హామీ పథకం విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈ సభలను విజయవంతం చేయాల్సిన బాధ్యతను స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఆయా జిల్లాల మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులకు టీపీసీసీ అప్పగించనుంది. అయితే రెండో విడతలో చివరి రోజుల్లో సీఎం వెళ్లే మెదక్, నిజామాబాద్ జిల్లాలకు సంబంధించిన షెడ్యూల్ ఇంకా పూర్తిస్థాయిలో ఖరారు కావాల్సి ఉందని సమాచారం. మొత్తం మీద మున్సిపల్ ఎన్నికలకు ముందు జిల్లాల పర్యటనలతో రాజకీయంగా పూర్తి స్థాయిలో కదలిక తీసుకురావడమే సీఎం వ్యూహంగా కనిపిస్తోంది.




హైదరాబాద్: తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. వీరిలో 25,62,369 మంది పురుష ఓటర్లు కాగా.. 26,80,014 మంది మహిళా ఓటర్లు, 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉండగా.. కొత్తగూడెం కార్పొరేషన్‌లో అత్యల్పంగా 1,34,775 మంది ఓటర్లు ఉన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా.. అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత నోటిఫికేషన్ విడుదల కానుంది. జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మొత్తం ఎన్నికల పర్వంలో రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకం కావడంతో అధికారులు దీనిని సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో గడువు ముగిసిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల ఎన్నికలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే.



## మేడారం జాతరకు 3,495 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్: ఈ నెల 28 నుంచి 31 వరకు మేడారంలో సమ్మక్క- సారలమ్మ జాతర జరగనుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి 3,495 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. అవసరమైతే మరిన్ని బస్సులు నడిపే విధంగా కార్యాచరణ చేపట్టింది. వీటిల్లో సాధారణ ఛార్జీకి 50 శాతం అదనపు మొత్తాన్ని జోడించి వసూలు చేయాలని నిర్ణయించింది. ప్రత్యేక పండుగలు, జాతరలు, ఇతర ఉత్సవాల సమయంలో నడిపే ప్రత్యేక బస్సుల్లో 50 శాతం వరకు ఛార్జీలు పెంచుకునేందుకు ఆర్టీసీకి అనుమతి ఉంది. గత జాతర సమయంలో ఆర్టీసీ 3,491 ప్రత్యేక బస్సులు నడిపితే అవి కీలక సమయాల్లో సరిపోలేదు.
దీంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. గత పొరపాట్లను గుర్తించిన సంస్థ ఈసారి అవి పునరావృతం కాకుండా చర్యలు చేపడుతోంది. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈ బస్సుల్లో కూడా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని ఆర్టీసీ వెల్లడించింది. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంటుందని తెలిపింది.



## ఘనంగా అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ ప్రారంభం

హైదరాబాద్: సంక్రాంతి పండగ సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన 7వ అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ ఘనంగా ప్రారంభమైంది. ఇవాళ్టి నుంచి ఈనెల 15 వరకు నిర్వహించే ఫెస్టివల్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. స్వీట్ ఫెస్టివల్‌లో భాగంగా జాతీయ, అంతర్జాతీయ మిఠాయిలు, తెలంగాణ పిండి వంటలతో కూడిన 60 స్టాళ్లు అందుబాటులో ఉన్నాయి. 120 హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్స్ స్టాల్స్ ఏర్పాటు చేశారు.

19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్స్, 15 రాష్ట్రాల నుంచి 55 దేశవాళీ కైట్ క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు. ఫెస్టివల్‌లో వీక్షకులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారు. ఈనెల 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ జరగనుంది.



## వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీలన్నీ భర్తీ చేస్తాం: మంత్రి రాజనర్సింహ

హైదరాబాద్: ఆరోగ్య తెలంగాణ కోసం వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. నూతనంగా ఎంపికైన 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్స్ గ్రేడ్-2లకు.. కోఠి మెడికల్ కళాశాల ఆవరణలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రాజనర్సింహ నియామక పత్రాలను అందజేశారు. ఇప్పటి వరకూ ఆరోగ్య శాఖలో దాదాపు 10వేల పోస్టులు భర్తీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాబోయే రోజుల్లో మరో 10వేల పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు.

ఒక వ్యాధిని నిర్ధరించాలంటే.. అందులో ల్యాబ్ టెక్నీషియన్స్ పాత్ర ఎంతో కీలకమన్నారు. నగరవ్యాప్తంగా 145 పాలి క్లినిక్స్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ప్రతి 35-40 కిలోమీటర్లకు ఒక ట్రామా క్లినిక్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# తెలంగాణలోని విద్యార్థులకు గుడ్ న్యూస్

## ఉచితంగా కిట్... కిట్‌లో ఉండే 21 వస్తువులు





హైదరాబాద్ : తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గుడ్ న్యూస్. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కిట్లు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దమైంది.

వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు తెరుచుకునే రోజే విద్యార్థులకు ఈ కిట్లను అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాల విద్యార్థులకు అందించే వస్తులకు సంబంధించి సెంట్రల్ ప్రొక్యూర్మెంట్‌పై ఉన్నతాధికారులతో సమీక్షించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు కిట్ అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**కిట్లలో ఉండే వస్తువులు ఇవే...** ఇకపోతే తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు అందించనున్న కిట్లలో ఏమేమి ఉంటాయనే వివరాలను ఓసారి తెలుసుకుందాం. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే కిట్లలో యూనిఫామ్‌తోపాటు స్కూల్ బెల్ట్, టై, షూస్, స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, ఇతర వస్తువులను అందించేందుకు అవసరమైన ప్రొక్యూర్మెంట్ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఒకటో తరగతి విద్యార్థులకు డిక్షనరీ ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. వేసవి సెలవుల పాఠశాల తిరిగి ప్రారంభం కాగానే విద్యార్థులకు కిట్లను పంపిణీ చేయనున్నారు.

**నాణ్యత విషయంలో రాజీపడొద్దు...** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించనున్న 22 వస్తువులతో కూడిన కిట్‌కు సంబంధించి నాణ్యత విషయంలో రాజీపడొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు కిట్ అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల విషయంలో ఖర్చుకు వెనకాడొద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడొద్దని చెప్పుకొచ్చారు.

యూనిఫామ్ తో పాటు 21 వస్తువులతో కూడిన కిట్‌ను విద్యార్థులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు.

**21 వస్తువులతో కూడిన కిట్...** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించనున్న 22 వస్తువులతో కూడిన కిట్‌కు సంబంధించి నాణ్యత విషయంలో రాజీపడొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు కిట్ అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల విద్యార్థులకు అందించే వస్తువులకు సంబంధించి సెంట్రల్ ప్రొక్యూర్మెంట్‌పై ముఖ్యమంత్రి గారు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల విషయంలో ఖర్చుకు వెనకాడొద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడొద్దని తెలిపారు. యూనిఫామ్‌తో పాటు 21 వస్తువులతో కూడిన కిట్‌ను విద్యార్థులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి,వేం నరేందర్ రెడ్డి, స్పెషల్ సీఎస్ సబ్యసాచి ఘోష్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## చైనా నియంత్రణ.. అమెరికా హెచ్చరిక.. వాణిజ్య యుద్ధంలో మరో కోణం

అమెరికా , చైనా మధ్య వాణిజ్య రంగంలో ఉద్రిక్తతలు గత కొన్ని సంవత్సరాలుగా విస్తరించాయి. ముఖ్యంగా టారిఫ్‌లు, వాణిజ్య అడ్డంకులు, సాంకేతిక ఆంక్షలు ఈ రెండు ఆర్థిక శక్తుల మధ్య ఘర్షణలకు కారణంగా నిలుస్తున్నాయి. ఇప్పుడు ఈ పోరాటం మరో కీలక రంగంలోకి అరుదైన అయస్కాంత లోహాల సరఫరాలో దారితీస్తోంది. చైనా ప్రపంచవ్యాప్తంగా ఈ అరుదైన లోహాల ఉత్పత్తిలో దాదాపు 70 శాతం, వాటి శుద్ధిలో 90 శాతం నియంత్రిస్తుంది. ఈ గణాంకం చైనా స్థాయి ప్రభావాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. అమెరికా పక్షాన ఈ ఆధిపత్యం తీవ్రమైన ఆందోళనకు దారి తీసింది. ఎందుకంటే ఇవి ఆధునిక సాంకేతికతలో, రక్షణ రంగంలో, హరిత శక్తి ఉత్పత్తిలో అత్యంత అవసరమైన మూల పదార్థాలు.

**అరుదైన అయస్కాంత లోహాలు – ఆధునిక సాంకేతికతకు వెన్నెముక...** ఈ లోహాల్లో ముఖ్యమైనవి నియోడైమియం , ప్రసోడైమియం , డిస్ప్రోసియం వంటి మూలకాలు. వీటి మిశ్రమాలతో తయారయ్యే "శాశ్వత అయస్కాంతాలు" రాబోయే టెక్నాలజీ విప్లవానికి మౌలిక భాగాలు. ఇవి ఎలక్ట్రిక్ వాహనాల మోటార్లలో, పవన విద్యుత్ టర్బైన్‌ల జనరేటర్లలో, కంప్యూటర్ హార్డ్ డిస్క్ డ్రైవ్‌లలో, స్పీకర్లు , హెడ్‌ఫోన్‌లలో విస్తృతంగా ఉపయోగిస్తారు. ఎలక్ట్రిక్ వాహనాలు బలమైన శాశ్వత అయస్కాంత మోటార్లతో అధిక సామర్థ్యం, తక్కువ శక్తి వినియోగాన్ని అందించడానికి ఈ లోహాలు కీలకం. డిఫెన్స్ రంగం: మిసైల్స్, ఫైటర్ జెట్లు, రాడార్లు, స్మార్ట్ బాంబుల్లో ఉపయోగించే సూక్ష్మ సెన్సార్లు.. మోటార్ల తయారీలో ఇవి తప్పనిసరి. వైద్య పరికరాలు: ఎంఆర్ఐ స్కానర్లు, పేస్‌మేకర్లు, హియరింగ్ డివైస్‌ల లో రేర్ ఎర్త్ ఎలిమెంట్లు అనివార్యమైనవి.

**పారిశ్రామిక వినియోగాలు:** హై పర్ఫార్మెన్స్ మోటార్లు, రోబోటిక్ వ్యవస్థలు, పవర్ టూల్స్ వంటి రంగాల్లో కూడా ఇవి ప్రధాన స్థానం పొందాయి.

**చైనా వ్యూహం – వాణిజ్యానికి ఆయుధంగా అరుదైన లోహాలు**... చైనా తన ప్రభావాన్ని పెంచుకునే ప్రయత్నంలో ఈ అర్థవంతమైన వనరులను "ట్రంప్ కార్డ్" గా ఉపయోగించడం ప్రారంభించింది. అమెరికా చైనాపై టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో బీజింగ్ ఈ అరుదైన లోహాల ఎగుమతులను పరిమితం చేసే ప్రయత్నాల్లో ఉంది. ఇది కేవలం వాణిజ్య సమస్య కాదు, భౌగోళిక రాజకీయ ప్రభావాన్ని పెంచే ఆలోచన. అమెరికా, యూరోప్, జపాన్ వంటి దేశాలు ఈ లోహాల సరఫరాలో చైనాపై ఆధారపడటం, చైనాకు వ్యూహాత్మక అధికారాన్ని ఇస్తోంది. చైనా ఈ లోహాలను సరఫరా చేయనంత మాత్రాన ఆధునిక చిప్‌లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, మిలిటరీ తయారీ లైన్లు ఆగిపోయే ప్రమాదం ఉంది. దీనిని అమెరికా పెద్ద హెచ్చరికగా తీసుకుంది.

**ప్రపంచ వ్యూహాత్మక మార్పులు...** అమెరికా ప్రభుత్వం ఇప్పటినుంచే ప్రత్యామ్నాయ సరఫరా గొలుసులను ఏర్పరచడానికి దూకుడుగా ప్రయత్నిస్తోంది. ఆస్ట్రేలియా, కెనడా, ఇండియా, వియత్నాం వంటి దేశాల్లో అరుదైన లోహాల గనులను అభివృద్ధి చేసేందుకు పెట్టుబడులు పెడుతోంది. అదేవిధంగా రీసైక్లింగ్ టెక్నాలజీ ద్వారా వాడిన పరికరాల నుంచి రేర్ ఎర్త్ మూలకాలను తిరిగి పొందే దిశగా పరిశోధన జరుగుతోంది.

**భవిష్యత్తు దిశ...** అరుదైన అయస్కాంత లోహాలు కేవలం వాణిజ్య విలువ కలిగిన వనరులు కావు. ఇవి సాంకేతిక ఆధిపత్యం, రక్షణ భద్రత, గ్రీన్ ఎనర్జీ భవిష్యత్తుకి మూలాధారం. ఈ వనరులపై చైనాకున్న పట్టు, ప్రపంచ సమతౌల్యాన్ని మార్చే శక్తిగా మారింది. అమెరికా , ఇతర దేశాలు ఈ ఆధారపడటాన్ని తగ్గించుకోవడమే కాక, స్వావలంబనకు దిశగా కదలడం అనివార్యం అవుతోంది. అనగా 21వ శతాబ్దపు "వాణిజ్య యుద్ధాలు" ఇకపై కేవలం టారిఫ్‌లతో కాకుండా, అరుదైన ఖనిజాల ఆధిపత్యం తో నిర్ణయించబడతాయనడం తప్పు కాదు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యం...

**ఎమ్మెల్యే మల్లారెడ్డి కాంగ్రెస్ పాలనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు...**

**అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు...**



శామీర్పేట (గరుడ వార్త) : ఎమ్మెల్యే మల్లారెడ్డి కాంగ్రెస్ పాలనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదంటూ అలియాబాద్ మూడు చింతలపల్లి మునిసిపల్ కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం శామీర్పేట ఉమ్మడి ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో అలియాబాద్, మూడు చింతలపల్లి మునిసిపల్ కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఎమ్మెల్యే మల్లారెడ్డి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై సోయ లేకుండా కేసీఆర్ కుటుంబానికి భజన చేస్తున్నారంటూ వారు ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల సమీపిస్తుండడంతో కాంగ్రెస్ పార్టీ పై దుమ్మెత్తు పోస్తున్నారంటూ వారు ఆరోపించారు. అంతేకాకుండా కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఫలితాలు వచ్చినప్పటికీ మల్లారెడ్డి ఇంకా కళ్ళు తెరవ లేదంటూ వారు ధ్వజమెత్తుతున్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలవబోయేది తమ కాంగ్రెస్ పార్టీని వారు ధీమా వ్యక్తం చేశారు. అందుకే ఎమ్మెల్యే మల్లారెడ్డి ఓటమి భయంతోనే పొంతనలేని మాటలు మాట్లాడుతున్నారంటూ వారు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొమ్మల పల్లి నరసింహులు, అలియాబాద్ కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ప్రెసిడెంట్ తుంకి రమేష్, అలియాబాద్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ సెక్రెటరీ కమటం కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మూడ్చింతలపల్లి మున్సిపల్ ప్రెసిడెంట్ దోసకాయల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల పోలింగ్ స్టేషన్‌ల డ్రాఫ్టు జాబితా విడుదల చేసిన... అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్ర శేఖర్.



**శామీర్పేట (గరుడ వార్త) : రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా మంగళవారం అలియాబాద్ పురపాలక సంఘం పరిధిలోని 20 వార్డుల పోలింగ్ స్టేషన్ ల డ్రాఫ్టు జాబితా అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో నోటీస్ బోర్డ్ పై అమర్చారు. ఈ కార్యక్రమములో TPO వికాస్, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్స్ తోపాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.**

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ





**శామీర్ పేట, జనవరి 13 (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా శామీర్ పేట కు చెందిన కీ. శే. బత్తిని ఈశ్వర్ గౌడ్ వారి కుటుంబ సభ్యులు, దేశం శ్రీనివాస్ గౌడ్( పోలీస్) వారి కుటుంబ సభ్యులు, ఆప్కారి నరేష్ గౌడ్ వారి కుటుంబ సభ్యులు, అలాగే కూరాకుల సాయి వారి కుటుంబ సభ్యులు 50 కేజీల బియ్యం, సిద్దిపేటకు చెందిన చిలువేరు రాజు వారి కుటుంబ సభ్యులు, ప్రమోద్ రెడ్డి లు అన్నదానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.**

## మానవ తప్పిదాలే రోడ్డు ప్రమాదానికి ప్రధాన కారణాలు...ఆర్టీఏ సభ్యుడు జయపాల్ రెడ్డి

**నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదంలో అరికట్టవచ్చు... శామీర్పేట సిఐ శ్రీనాథ్.**




శామీర్ పేట, జనవరి 13 (గరుడ వార్త) : ప్రధానంగా మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు జరుగు తున్నాయని జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం శామీర్ పేట మండలం తూంకుంటలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, ఆర్టీఏ అధికారులు వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాలతో జరుగుతున్నాయని, ముఖ్యంగా అతివేగం, వాహనాలను నిర్లక్ష్యంగా నడపడంతో ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ట్రాఫిక్ నిబందనలను పాటించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు నియమ నిబంధనలు పాటించి నడపాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను నటించుకోవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని చెప్పారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ ఎస్ఐ నవీన్ రెడ్డి, ఆర్టీఏ ఎంవీఐ త్రివేణి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# పైసల్లేవు.. పనులెలా..?

ఆదిలాబాద్ : జిల్లాలో ఎన్నికైన పంచాయతీ పాలకవర్గం ఈ నెల 22న కొలువుదీరనుంది.. అభివృద్ధిపై కొత్త పాలకులపైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అయితే పంచాయతీల ఖజానా ఖాళీగా ఉండటంతో పనులెలా చేయాలనే ఆందోళన నెలకొంది. ఇప్పటికే గత సర్పంచులు చేసిన పనులకు సంబంధించి రూ.11 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘ నిధులతోపాటు సాధారణ, ఉపాధి హామీ పథకం, పన్నుల వసూలు తదితర నిధులే ప్రధాన ఆదాయం. ఉద్యోగుల జీతభత్యాలకు 30 శాతం, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, మంచినీరు తదితర వాటికి 15 శాతం చొప్పున, రహదారులు, కాల్వలకు 20, ఇతర అవసరాలకు 10 శాతం నిధులు వెచ్చించాల్సి ఉంటుంది.

**నిధుల్లో కోత :** 2019లో ఎన్నికల తర్వాత జిల్లాకు రూ.118.95 కోట్లు మంజూరైతే.. గత మూడేళ్ల నుంచి నిధుల్లో పూర్తిగా కోత పడింది. 2022–23లో రూ.52.32 కోట్లు రాగా, 2023–24లో రూ.39.61 కోట్లకు తగ్గింది. గతేడాది కేవలం రూ.26.10 కోట్లు వచ్చాయి. చివరకు ట్రాక్టర్ల కిస్తీలు కట్టలేని పరిస్థితి.

**ఇలా సమకూర్చుకోవాలి :** ప్రతి పంచాయతీకి సొంత వనరుల ద్వారా, ప్రభుత్వ గ్రాంట్లు, తమ వాటాగా లభించేవి, విరాళాల ద్వారా ఆదాయం వస్తుంది. జనాభాను బట్టి ఒక వ్యక్తికి రూ.618 చొప్పున ప్రభుత్వ గ్రాంటు మంజూరవుతుంది. సొంత వనరుల్లో ఇంటి పన్నులతో పాటు ప్రత్యేకంగా లైసెన్స్ ఫీజు, లేఅవుట్ ఫీజు, భవన నిర్మాణాలకు అనుమతుల రుసుం, కాంపౌండింగ్ ఫీజు, సంతల రుసుము, వేలం ద్వారా వచ్చే ఆదాయం ఉంటుంది.

**స్పందిస్తేనే.. :** పథకాలపై అవగాహన పెంచుకొని స్పందిస్తే సగం సమస్యలను పరిష్కరించే వీలుంది. ఉపాధి హామీ కింద కొన్ని పనులు పూర్తి చేసుకునే వీలుంది. వీటితో పాటు సమస్యలను ఎమ్మెల్యే, ఎంపీల దృష్టికి తీసుకెళ్లి నిధులు రాబట్టుకోవచ్చు.

# మేం మారమంతే!

భైంసా : ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి నిలయాలుగా మారుతున్నాయి. వివిధ శాఖల్లో కొందరు అధికారులు, ఉద్యోగులు అత్యాశకుపోయి లంచావతారం ఎత్తుతున్నారు. చేయి తడపందే పనవ్వదని, దస్త్రాలు కదలవని నిరూపిస్తున్నారు. సాధారణ పౌరులైనా, శాఖలోని ఉద్యోగులైనా ముడుపులు చెల్లించాల్సిందే. వీరి ఆగడాలకు విసిగిపోయి అవినీతి నిరోధక శాఖను ఆశ్రయిస్తున్నారు. భైంసాలో తరచూ ఏసీబీ దాడులు జరుగుతున్నా అధికారుల్లో మార్పు రావడం లేదు.

**ఆబ్కారీశాఖలో..**

ఈ ఏడాది ఫిబ్రవరి 25న రూ.10వేలు లంచం తీసుకుంటూ భైంసా ఎక్సైజ్ ఎస్సై నిర్మల, కానిస్టేబుల్ సుజాత ఏసీబీకి పట్టుబడ్డారు. కామోల్ గ్రామానికి చెందిన తెల్లకల్లు లైసెన్స్‌దారుడు తన ఏరియాలో మరో లైసెన్స్‌దారుడు అమ్మకాలు చేస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. ఇద్దరి మధ్య వివాదాన్ని పరిష్కరించడానికి రూ.10 వేలు లంచం డిమాండ్ చేశారు. ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా డీఎస్పీ విజయ్‌కుమార్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

**ఆర్టీఏలోనూ..** అక్టోబర్ 22 అర్ధరాత్రి మహారాష్ట్ర సరిహద్దులోని బెల్‌తరోడ ఆర్టీఏ చెక్‌పోస్టును ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహిం



చారు. ఉదయం 5 గంటల వరకు కంప్యూటర్‌లోని లావాదేవీలు, జరిమానా వివరాలపై ఆరా తీశారు. అక్కడ లభ్యమైన రూ. 3 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

**ఆరోగ్యశాఖలో..**

సామాన్య ప్రజలకే కాకుండా, శాఖలో పనిచేసే కిందిస్థాయి సిబ్బంది లంచాలకు బాధితులుగా మారుతున్నారు. అందుకు తాజాగా భైంసాలో పట్టుబడిన వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగి భీమన్న ఉదాహరణ. ఓ ఉద్యోగికి సంబంధించిన ఎఫ్‌టీఏ, సరెండర్ లీవ్, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంటు ఫైల్‌ను రూపొందించి ఉన్నతాధికారులకు పంపేందుకు రూ.9వేలు లంచం సొమ్మును ఫోన్‌పే లో తీసుకుని అనిశా అధికారులకు చిక్కారు.

**రెవెన్యూశాఖలో...** రెండేళ్ల క్రితం ఖానాపూర్‌లో తహసీల్దారుగా పనిచేసిన నరేందర్ సైతం ఏసీబీ వలకు చిక్కారు.

పురపాలికలో.. 2024 మే 22న భైంసా పురపాలక కమిషనర్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి ఆస్తిపన్ను తగ్గించేందుకు రూ.30వేలు డిమాండ్ చేశారు. ఏసీబీ అధికారులు దాడి చేయగా కమిషనర్‌తోపాటు బిల్‌కలెక్టర్ వారికి చిక్కారు.

# అంతా ఖాళీ.. అంతం ఎలా చేసేది!

కుష్ఠు రహిత సమాజానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ గడువు పొడిగిస్తూనే ఉంది. కొత్తగా కేసులు వస్తుండటమే ఇందుకు కారణం. జిల్లాలోనూ కొత్త కేసులు బయటపడుతూనే ఉన్నాయి. వచ్చే అయిదేళ్లలో ఈ వ్యాధిగ్రస్థుల ఊసే ఉండదంటూ ఈ విభాగంలో నియామకాన్ని 1995లోనే నిలిపివేశారు. ఈ ఏడాది సైతం సర్వే ప్రారంభించగా ఈ విభాగం మాత్రం పూర్తిగా ఖాళీగా కనిపిస్తోంది.

**పట్టింపు కరవు..** ఈ వ్యాధి గుర్తింపు పక్షంరోజుల పాటు నిర్వహించేందుకు ఆరోగ్యశాఖ సిద్ధమైంది. ప్రతి సంవత్సరం ఈ సర్వే సమయంలోనే హడావుడి తప్పితే.. ఆ తర్వాత పరిస్థితిపై ఆరా తీసేవారే కరవయ్యారు. కనీసం గ్రామాలు, ఇతర పట్టణాల్లో ఆశా కార్యకర్తలతో నెట్టుకొస్తుండగా జనాభా రెండు లక్షలకు చేరువైన మంచిర్యాలలో మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి సర్వే నిర్వహించింది లేదు. ఆశాకార్యకర్తలు వందకు పైగా ఉండాల్సిన చోట ఒక్కరు కూడా లేరు. ఆరోగ్యశాఖలో ప్రతి విభాగానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయిస్తుండగా భయంకరమైన ఈ అంటువ్యాధి కుష్ఠుకు సంబంధించి జిల్లా మొత్తం ఒకే ఒక్కరు(సూపర్‌వైజర్ స్థాయి వ్యక్తి, ఈయన మరికొద్ది రోజుల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు) ఉన్నారు.

**రద్దు చేసేందుకు సన్నాహాలు..**

ప్రతి ఆరోగ్య కేంద్రానికి ఒక ఏపీఎంఓ(అసిస్టెంట్ పారామెడికల్ ఆఫీసర్), వీరి పర్యవేక్షణకు మరో ఆరుగురు డీపీఎంఓలు ఉండాల్సి ఉండగా జిల్లాలోని 18కి పైగా కేంద్రాల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా అందుబాటులో లేరు. ప్రస్తుతం ఉన్న సూపర్‌వైజర్ కూడా ఒక్కరే ఉండటం, మరో నెలలో ఉద్యోగ విరమణ చేస్తుండటంతో పూర్తిగా ఖాళీ అయ్యేందుకు సిద్ధంగా ఉంది.

# ఇచ్చుకో.. కట్టుకో.. ఇక కుదరదు

హైదరాబాద్: ఇల్లు నిర్మిస్తే.. ఆ దారి నిండా ఇటుక, ఇసుక, మట్టి వేయడం.. ఆ ప్రాంత అధికారికి అంతోఇంతో ఇచ్చేసి జబర్దస్తీ చేయడం.. కాలనీవాసులు గట్టిగా అడిగితే బెదిరించడం ఇక కుదరదు. ఏకంగా జీహెచ్ఎంసీ చట్ట సవరణకు ప్రతిపాదనలు చేసింది. రేపోమాపో ఆదేశాలు రానున్నాయి.

లక్ష్యం నగరంలో రహదారి కాలుష్యాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లపై ఇసుక, ఇటుకలు, మట్టి వంటి నిర్మాణ సామగ్రిని వేయడం, విక్రయించడంపై నిషేధం విధించేందుకు రంగం సిద్ధం చేసింది. భారీ జరిమానాలు విధించడం, ఉల్లంఘనులకు ఏడాది జైలుశిక్ష పడేట్టు జీహెచ్ఎంసీ చట్టంలో సవరణలు రాబోతున్నాయి.

**ప్రతిపాదనలు ఇలా..**

జీహెచ్ఎంసీ చట్టంలోని ఆర్టికల్ 112(2), (3,), (20), (25), ఆర్టికల్



115(39) ప్రకారం.. జులై 15, 2025న అప్పటి పురపాలకశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ, హైడ్రా కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు సమావేశమై.. చేర్పులు, మార్పులపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. రహదారులు, రద్దీ ప్రాంతాల్లో పాదచారులు, వాహనదారులు చెత్త పడేసేందుకు చిన్న డబ్బాలను ఏర్పాటు చేయడం, వ్యర్థాల నిల్వకు తాత్కాలిక ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను అందుబాటులోకి తేవడం, చెత్త నిర్వహణ కేంద్రాలను పెంచనున్నారు.

ఇసుక, ఇటుకలు, కంకర, మట్టి, ఇతర నిర్మాణ సామగ్రిని రహదారులు, కాలిబాటలపై అమ్మడాన్ని నిషేధిస్తున్నారు.

భవన నిర్మాణానికి సంబంధించిన వ్యర్థాలను అనధికారికంగా తరలించడం, ఇష్టానుసారం డంపింగ్ చేయడంపై నిషేధం ఉంటుంది. నిర్మాణ వ్యర్థాలను జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా తరలించే వాహనాలకు మొదటి తప్పుగా రూ.లక్ష జరిమానా. ఒక వేళ ఆ వ్యర్థాలను నాలాలు, చెరువులు, రోడ్లు, కాలిబాటలు, ప్రజలు తిరిగే చోట పడేస్తే.. రెట్టింపు జరిమానా విధిస్తారు.

రెండు, అంతకు మించి తప్పిదాలకు పాల్పడితే రూ.5లక్షల జరిమానా, ఏడాది వరకు జైలు శిక్ష ఉండేలా సవరణ చేస్తున్నారు.

జీహెచ్ఎంసీ వెలుపల కూడా వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునే అధికారాన్ని కార్పొరేషన్‌కు కల్పిస్తారు. ఒకసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ వస్తువుల విక్రయం, వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తూ సెక్షన్ 487-ఏను జీహెచ్ఎంసీ చట్టంలో చేర్చనున్నారు.

# ఆయనదే 'గుత్తా'ధిపత్యం!

హైదరాబాద్ : శేరిలింగంపల్లి జోన్ పరిధిలో ఎంటమాలజీ విభాగంలో ఒప్పంద కార్మికుల సరఫరా కోసం టెండర్ పిలిచారు. నలుగురు గుత్తేదారులు పోటీపడ్డారు. 15శాతం నుంచి 24 శాతం వరకు తక్కువ ధరలకు టెండర్‌లు దాఖలు చేశారు. ఒక గుత్తేదారు మాత్రం నామమాత్రంగా తక్కువ ధరకు టెండర్ వేశారు. మిగిలిన గుత్తేదారులపై అనర్హత వేటు వేసేందుకు ఉన్నత స్థాయిలో పైరవీలు జరుగుతున్నాయి. తనకే టెండర్ దక్కేలా చక్రం తిప్పుతున్నారు.


జీహెచ్ఎంసీలో ఎక్కడైనా సరే ఆయన టెండర్ వేస్తే దక్కాల్సిందే. ఉన్నత స్థాయి అధికారులు సైతం అతనికే మొగ్గు చూపుతున్నారు. అతని కోసం జోన్‌కొక నిబంధన పెడుతున్నారు. ప్రధాన కార్యాలయంలోని ఓ సీఈ స్థాయి అధికారి అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఇటీవల గుత్తేదారులంతా ఆయనపై ఫిర్యాదు చేశారు. 'ఈ ఒక్కసారికి వదిలేయండి..' అంటూ ఆ అధికారి గుత్తేదారులకు నచ్చజెప్పారంటే.. పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

భారీ నజరానాలు..

ప్రధానంగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, ఖైరతాబాద్ జోన్లలో ఆ గుత్తేదారుదే హవా. ఒక్క పాతబస్తీ జోలికి మాత్రం వెళ్లడం లేదు. టెండర్లన్నీ ఎక్సెస్‌కు (అధిక రేట్లకు) దక్కించుకుంటున్నారు. అధికారులకు నజరానాలు ఇస్తున్నాడు.

ఆ గుత్తేదారు ఓ పేరుతో సంస్థను స్థాపించారు. ఓ మహిళను భాగస్వామిగా చేర్చుకొని వ్యక్తిగత పాన్‌కార్డును జత పరుస్తున్నారు. సంస్థ పాన్‌కార్డు అయితే.. 1శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వ్యక్తిగత పాన్‌కార్డుతో0.5శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఆ విధంగా రూ.కోట్లలో పన్ను ఎగవేస్తున్నారు.

ప్రధాన కార్యాలయంలో ఉండే ఓ చీఫ్ అధికారి పూర్తిస్థాయి సహకారం ఉంది. టెండర్లలో మతలబులు సృష్టించి మిగిలిన వారిపై అనర్హత



వేటు వేసే పని ఆయన తీసుకుంటున్నారు.

జోనుకో నిబంధన..!

ఖైరతాబాద్ జోన్ పరిధిలో టెండర్లకు టర్నోవర్ మెలిక పెట్టి చిన్న గుత్తేదారులపై అనర్హత వేటు వేయించారు. మిగిలిన ప్రాంతాల్లో దీన్ని అమలు చేయలేదు.

ఎల్బీనగర్ జోన్‌లో అడిషనల్ సెక్యూరిటీ డిపాజిట్‌లో మతలబు పెట్టారు. ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ కూడా తనకు అనుకూలంగా మలుచుకున్నారు.

కూకట్‌పల్లి జోన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో అన్‌కండిషనల్ సాల్వెన్సీ సర్టిఫికెట్ జత పర్చాలనే కొత్త నిబంధన పెట్టి కొంతమందిపై వేటు వేయించారు. ఇదే నిబంధన ఇతర జోన్లలో వర్తింపజేయలేదు. జీహెచ్ఎంసీలో మొత్తం ఒప్పంద కార్మికులకు గత ఏడాది బడ్జెట్‌లో రూ.632 కోట్లు వెచ్చించారు. దీనిలో సగం దుర్వినియోగం అవుతున్నాయన్న ఫిర్యాదులు ఉన్నాయి. విజిలెన్సు విచారణ కూడా జరిగింది.

# బీటీపీఎస్.. బొగ్గు నిల్వలు 'లెస్'



మణుగూరు : భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం(బీటీపీఎస్)లో బొగ్గు నిల్వలు అడుగంటాయి. కేవలం రెండు, మూడు రోజులకు సరిపడా 46వేల టన్నుల బొగ్గు మాత్రమే నిల్వ ఉంది. బీటీపీఎస్‌లో నాలుగు యూనిట్ల నుంచి 1,080 మెగావాట్ల విద్యుదుత్పత్తికి రోజుకు 14,500 టన్నుల బొగ్గు అవసరం. అయితే భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 15 రోజులకు సరిపడా 2 లక్షల టన్నుల బొగ్గు బీటీపీఎస్‌లో నిల్వ ఉండాలి. అయితే తక్కువ బొగ్గు నిల్వ ఉండటంతో విద్యుదుత్పత్తిపై ప్రభావం పడనుంది. ఎప్పుడు అత్యవసర పరిస్థితి ఏర్పడుతుందోనని ఇంజినీర్లకు సంక్రాంతి సెలవులను ఉన్నతాధికారులు రద్దు చేశారు. కూతవేటు దూరంలోని మణుగూరు గనుల నుంచి బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా జరుగుతుంది. అయితే అక్కడి నుంచి నాణ్యమైన బొగ్గు సరఫరా కావటం లేదని తీసుకోవటం లేదు. అందుకే బొగ్గు కొరత ఏర్పడింది. విద్యుదుత్పత్తికి జీ-9, 10 స్థాయి కలిగిన బొగ్గు వినియోగిస్తారు. మణుగూరు గనుల నుంచి ఆ స్థాయి నాణ్యత కలిగిన బొగ్గు ఉత్పత్తి కావటం లేదు. గతంలో మణుగూరు ఓసీ గని నుంచి బీటీపీఎస్‌కు జీ-9, 10 నాణ్యత కలిగిన బొగ్గు రవాణా అయ్యేది. అయితే గనిలో బొగ్గు వెలికితీసే ఓబీ కంపెనీ ఒప్పంద గడువు ముగియటం, మళ్లీ కొత్త ఓబీ కంపెనీతో సింగరేణి ఒప్పందం కుదుర్చుకునేందుకు కొద్దినెలల సమయం పట్టింది. ఆ వ్యవధిలో మణుగూరు ఓసీ గని నుంచి బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా జరగలేదు. ఓసీ-4లోనూ జీ-9 నాణ్యత కలిగిన బొగ్గు ఉత్పత్తి అవుతుంది. అయితే నీరు నిలిచిందని బొగ్గును ఓబీ కంపెనీ వెలికితీయటం లేదు. ఇలా ఈ రెండు గనుల నుంచి జీ-9, 10 నాణ్యత కలిగిన బొగ్గు సరఫరా కాకపోవటంతో బీటీపీఎస్‌లో నిల్వలు అడుగంటాయి. **భూపాలపల్లి నుంచి సరఫరా**బీటీపీఎస్‌కు బొగ్గు కొరత ఏర్పడిన నేపథ్య ంలో సమస్య జటిలం కాకుండా జెన్కో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. భూపాలపల్లి నుంచి బొగ్గు రవాణా చేసుకునేందుకు సింగరేణితో ఒప్పందం కుదుర్చుకుంది. రోజుకు 2వేల టన్నుల చొప్పున మొత్తమ్మీద 3 లక్షల టన్నుల బొగ్గు భూపాలపల్లి నుంచి రోడ్డుమార్గాన బీటీపీఎస్‌కు సరఫరా కానుంది. మూడు రోజుల్లో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. 'బీటీపీఎస్‌లో బొగ్గు నిల్వలు తక్కువైనా ప్రస్తుతాని కి వచ్చిన ఇబ్బందులేమీ లేవు. నాణ్యత లేకపోవటం వల్లే మణుగూరు గనుల నుంచి బొగ్గును తీసుకోవటం లేదు. బొగ్గు నిల్వలు పెరిగేలా ఇతర ప్రాంతం నుంచి దిగుమతి చేసుకుంటాం' అని సీఈ బిచ్చన్నకు తెలిపారు.

# కలిసికట్టుగా.. గెలిచేట్టుగా..!




ఖమ్మం : కబడ్డీ పోటీల్లో ఖమ్మం జిల్లా మహిళల జట్టు అద్భుత విజయాలు సాధిస్తోంది. 2021 నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటుతోంది. ఈ విజయాల వెనుక ఖమ్మం గ్రామీణ మండలం మద్దులపల్లిలోని సాంఘిక సంక్షమశాఖ మహిళా డిగ్రీ కళాశాల వెన్నుదన్నుగా నిలుస్తోంది. జిల్లా మహిళల కబడ్డీ జట్టులో సింహభాగం క్రీడాకారిణులు ఈ కళాశాలకు చెందినవారే కావటం విశేషం.

**తొమ్మిది మంది ఈ కళాశాలకు చెందినవారే**

ఇటీవల కరీంనగర్‌లో జరిగిన సీనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఖమ్మం జిల్లా మహిళా జట్టుకు కాంస్య పతకం దక్కింది. ఈ జట్టులో 12 మంది క్రీడాకారిణులు ఉండగా అందులో తొమ్మిది మంది మద్దులపల్లిలోని సాంఘిక సంక్షమశాఖ మహిళా డిగ్రీ కళాశాలకు చెందినవారే. తాజాగా పతకాలు సాధిస్తున్న జిల్లా జట్టులో కె.భవానీ (బీపీఈడీ), బి.ప్రియాంక (బీపీఈడీ), ఎం.కుసుమ (యుజీఈడీ), ఎస్.పూజిత (పీజీ) ఉన్నారు. వీరందరూ ఈ కళాశాలలో చదువుకున్నవారే. ప్రస్తుతం ఇక్కడ డిగ్రీ విద్యనభ్యసిస్తున్న జి.కావ్యశ్రీ, ఎం.మేఘన, ఎం.సువన్య, ఎన్.భావన, టి.అన్షిత సైతం ఇదే జట్టులో సభ్యులుగా కొనసాగుతున్నారు. మిగిలిన ముగ్గురు క్రీడాకారిణులు ఎస్.సిరి, కృష్ణవేణి, ఎస్.ఆసిని కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందినవారు. భావన, పూజిత, కుసుమ, ప్రియాంక ఇప్పటికే జాతీయ పోటీల్లో రాణించారు.

**మార్పు వచ్చింది ఇలా..**అంతర్జాతీయ క్రీడాకారిణి శివజ్యోతిని మద్దులపల్లి సాంఘిక సంక్షమశాఖ మహిళా డిగ్రీ కళాశాల కోచ్‌గా నియమించినప్పటి నుంచి ఇక్కడి విద్యార్థినులు కబడ్డీ క్రీడలో రాటుదేలుతున్నారు. కోచ్‌గా ఉన్న శివజ్యోతి 12 సీనియర్ నేషనల్ టోర్నీల్లో రాణించారు. ఆరుసార్లు భారత కబడ్డీ శిబిరంలో శిక్షణ పొందారు. ఓసారి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి అంతర్జాతీయ టోర్నీలో ఆడారు. ఎప్పుడు జూనియర్, సీనియర్ జట్ల ఎంపికలు జరిగినా ఈ కళాశాల క్రీడాకారులు, పూర్వ క్రీడాకారులు రంగంలోకి దిగి ప్రతిభ చాటుతున్నారు.

# తూకాల్లో 'అర'గదీస్తూ.. మోసాల్లో ఇరగదీస్తూ..!



ఖమ్మం : ఖమ్మం నగరంలో ఇటీవల తూనికలు, కొలతలశాఖ అధికారులు చేపల విక్రయ దుకాణాలపై తనిఖీలు చేశారు. ఓ దుకాణంలో రెండు కిలోల తూకం బాట్(రాయి) కిలోన్నర బరువు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. సదరు ఇనుప బాట్(రాయి)ని కిందిభాగంలో అరకిలో వరకు అరగదీసినట్లు తేల్చారు. ఇలా 14 చేపల దుకాణాలను తనిఖీ చేయగా ప్రతిచోటా ఇదేవిధంగా రెండు కిలోలకు అరకిలో తక్కువ బరువు కలిగిన తూకం రాళ్లు బయటపడ్డాయి. ఇక్కడ చేపల విక్రేతలందరూ ముఠాగా ఏర్పడి కొన్నేళ్లుగా తూకాల్లో మోసాలకు పాల్పడుతుండటం గమనార్హం. ప్రస్తుతం కిలో చేపల ధర రూ.160 పలుకుతోంది. కిలోకు పావు కిలో తక్కువగా ఉండటం వల్ల ఈలెక్కన వినియోగదారులు కిలోకు రూ.40 వరకు నష్టపోతున్నారు. రెండు కిలోల చేపలు కొంటే వినియోగదారులపై అదనంగా రూ.80 భారం పడుతోంది. కిలో ధర ఎక్కువ పలికే చేపలు విక్రయిస్తే నిర్వాహకులకు మరింత లాభాలు సమకూరుతాయి. తమకు వచ్చే కమీషన్ కూడా కలుపుకొంటే సగానికి సగం లాభం పొందుతున్నట్లే. కమీషన్ కంటే మోసాల ద్వారా ఎక్కువ ఆదాయం వస్తుండటంతో అందరూ ఇదే విధానం అమలుచేస్తున్నారు. ప్రతి ఆదివారం ఖమ్మం నగరంలో రూ.లక్షల్లో చేపల వ్యాపారం జరుగుతుంది.

**ఎలక్ట్రానిక్ కాంటాల్లో చిప్ అమర్చి...**

ఏన్కూరు, తల్లాడ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన పత్తి వ్యాపారులు సైతం ముఠాలుగా ఏర్పడి రైతులను మోసగిస్తున్నారు. ఏన్కూరు, నర్సింహారావుపేట, అన్నారుగూడెం, బాలప్పేట, తల్లాడ తదితర ప్రాంతాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో పత్తి వ్యాపారులు ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట తదితర జిల్లాలకు టాటాఏస్ వాహనాలు తీసుకెళ్లి రైతుల నుంచి పత్తి కొంటారు. ఎలక్ట్రానిక్ కాంటాలో ప్రత్యేకంగా చిప్ అమర్చి పత్తి కాంటా వేసే సమయంలో తమ జేబులో రహస్యంగా ఉన్న రిమోట్ ద్వారా ఆపరేట్ చేస్తారు. ఇలా ప్రతి క్వింటాకు 20కిలోల బరువు తగ్గుతుంది. క్వింటా పత్తికి ప్రభుత్వం మద్దతు ధర రూ.8,110 ప్రకటించింది. తూకంలో 20కిలోలు తగ్గటం వల్ల ప్రతి క్వింటాకు రైతులు సుమారు రూ.1,600 వరకు నష్టపోతున్నారు. కమీషన్ ద్వారా వ్యాపారులు మరికొంత లాభం పొందుతున్నారు. ఇలా ప్రతి క్వింటాకు రూ.2,000 వరకు రైతులను దగా చేస్తున్నారు. ఏన్కూరు, తల్లాడ మండలాల్లో ఆరుగురు పత్తి వ్యాపారులపై తూనికలు, కొలతలశాఖ అధికారులు, పోలీసులు ఇటీవల క్రిమినల్ కేసులు నమోదుచేసిన విషయం విదితమే. 'వినియోగదారులకు తూకాలపై అవగాహన ముఖ్యం. కిలో బాట్ల వెనకాల లీగల్ మెట్రాలజీ శాఖ స్టాంప్ ఉంటుంది. ఎక్కడైనా మోసాలు జరిగినట్లు తెలిస్తే ఫిర్యాదు చేయాలి' అని ఖమ్మం జిల్లా తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

# తీరనున్న రిజిస్ట్రేషన్ కష్టాలు..
## వాహనాల డీలర్లకే బాధ్యతలు

తాండూరు : కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ కోసం ఇకపై ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి వేచి చూడాల్సిన పనిలేదు. తాత్కాలిక రిజిస్ట్రేషన్(టీఆర్) లాగే.. శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చే బాధ్యతలను ప్రభుత్వం షోరూం డీలర్లకు అప్పగించనుంది. ఇందుకోసం రవాణాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ ప్రక్రియ వచ్చేనెల నుంచి అమలయ్యే అవకాశముందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.

**నాలుగు నియోజకవర్గాల పరిధిలో..**

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో వివిధ కంపెనీలకు సంబంధించిన ద్విచక్రవాహన షోరూంలు 16, నాలుగు చక్రాల డీలర్ షోరూంలు 8 ఉన్నాయి. వీటితోపాటు హైదరాబాద్ డీలర్‌షిప్ పరిధిలో ఇక్కడ సబ్‌డీలర్ షోరూంలున్నాయి. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ పరిధిలో రోజూ సుమారు 30- 40 ద్విచక్ర, 6-8 నాలుగు చక్రాల వాహనాలు విక్రయాలవుతున్నాయి.

**సమయం.. ఖర్చు ఆదా..**

అన్ని పన్నులు షోరూం డీలరు ముందే వసూలు చేస్తున్నా.. తాత్కాలిక రిజిస్ట్రేషన్ పత్రం మాత్రమే ఇచ్చేవారు. అన్ని పత్రాలు తీసుకొని రిజిస్ట్రేషన్‌కు ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. రాకపోకలు, రవాణా ఖర్చులు, సమయం వృథ అయ్యేది. ముఖ్యంగా మధ్యవర్తుల ప్రమేయం మరీ ఎక్కువగా ఉండేది. ఇకపై ఆ సమస్య తీరనుంది. డీలరు వద్దే శాశ్వత రిజిస్ట్రేషన్ కానుంది.

ఫ్యాన్సీ నంబరు కావాలంటే అదనం..



ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనానికి కోరుకున్న.. లేదంటే ఫ్యాన్సీ నంబరు కావాలంటే తాత్కాలిక రిజిస్ట్రేషన్‌తోపాటు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రవాణాశాఖ నిబంధనలు, అదనపు రుసుం చెల్లిస్తే కావాల్సిన నంబరును రవాణాశాఖ అధికారులు కేటాయిస్తారు. ఇందుకోసం సమయం పడుతుంది.

ప్రభుత్వానిది మంచి నిర్ణయం..-రమేశ్ గుప్తా, తాండూరు

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిది. కొత్త వాహనం తీసుకున్న తరవాత చాలా మంది వాహనదారులు రిజిస్ట్రేషన్ల కోసం ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలిక, శాశ్వత రిజిస్ట్రేషన్ విషయంలో డీలర్లు బాధ్యతగా వ్యవహరిస్తారు.

సర్కారు ఆదేశాలొచ్చాయి..-వెంకట్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి, వికారాబాద్ డీలర్ల వద్దనే రిజిస్ట్రేషన్ చేయించుకునే కొత్త విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించింది. తాత్కాలిక, శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం అవసరమైన అన్ని పత్రాలను ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. మా కార్యాలయంలో అన్ని పత్రాలు పరిశీలించి ఆమోదం తెలుపుతాం. కొత్త సాఫ్ట్‌వేర్ వచ్చాక ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

# అదనపు లోడ్‌కు ఓసీ ఉండాల్సిందే

హైదరాబాద్: నగరంలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అనుమతులు.. అక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా ఇన్నాళ్లు అడ్డగోలుగా విద్యుత్తు కనెక్షన్లు జారీ చేశారు. నకిలీ ఓసీతో కొందరు గుత్తేదారులు, అధికారులు కలిసి చేసిన ఆరాచకం అంతా ఇంతా కాదు. ఈ అక్రమాలను అరికట్టేందుకు టీజీఎస్పీడీసీఎల్ కొన్నాళ్లుగా విద్యుత్తు కనెక్షన్ల జారీని కఠినతరం చేసింది. గతంలో ఇచ్చిన కనెక్షన్లపై ఫిర్యాదుల ఆధారంగా విచారణ, బాధ్యులైన సిబ్బంది, అధికారులకు మెమోలు జారీ చేస్తుండటంతో ఇప్పుడు నిబంధనల మేరకు ఉంటే కొత్త కనెక్షన్ అంటున్నారు. దీంతో గ్రేటర్‌లోని పది సర్కిళ్ల పరిధిలో సరైన పత్రాలు లేని దరఖాస్తులను డిస్కం పెండింగ్‌లో పెట్టింది. గడిచిన కొన్ని నెలల్లో వీటి సంఖ్య వేలకు చేరింది. అది కర్మన్‌ఘాట్‌లో పదేళ్ల క్రితం భవనం. ఆ రోజుల్లో అవసరాన్ని బట్టి పరిమిత లోడ్‌తో విద్యుత్తు కనెక్షన్లు తీసుకున్నారు. ఇటీవల వినియో గం పెరిగింది. ఇప్పుడు 160 కేవీఏ అదనపు లోడ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అదనపు లోడ్ అయినా సరే అక్యుపెన్సీ సర్టిఫికెట్ సమర్పించాల్సిందేనని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు. ఓసీ సమర్పించకపోవడంతో నెలలుగా దరఖాస్తు పెండింగ్‌లోనే ఉంది.

**నోటరీలపై సందిగ్ధం..**

నగరంలో చాలా వరకు నోటరీ పత్రాలను స్థలాలను కొనుగోలు చేసినవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వీరికి సైతం రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌తో పోలిస్తే స్వల్పంగా ఎక్కువ ఛార్జీలు వసూలు చేసి



ఇది వరకు కనెక్షన్లు ఇచ్చేవారు. ఇప్పుడు వీటికి సైతం కనెక్షన్లు జారీ చేయడం లేదు. ఇవ్వాలని కొందరు అధికారులు, వద్దని మరికొందరు అంటున్నారు. సందిగ్ధం నెలకొంది. సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలో పదుల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని స్పష్టత కోసం కార్పొరేట్ కార్యాలయాన్ని సంప్రదిస్తున్నట్లు ఓ అధికారి 'ఈనాడు'కు తెలిపారు.

**జంట జలాశయ పరిధిలోనూ..**


జంట జలాశయాలను పరిరక్షంచేందుకు దశాబ్దాల క్రితం ప్రభుత్వం జీవో111 జారీచేసింది. వీటిపరిధిలో నిర్మాణాలకు స్థానిక సంస్థలు అనుమతులు ఇవ్వడం లేదు. అయినా పలు భవనాలు వెలిశాయి. ఇటీవల కట్టిన భవనాలకు విద్యుత్తు కనెక్షన్ కావాలని దరఖాస్తు చేసుకోగా.. నిబంధనల మేరకు అనుమతుల పత్రాలు, 10 మీటర్ల కంటే ఎత్తైన భవనాలైతే ఓసీ సమర్పిస్తేనే కనెక్షన్ అని అధికారులు పెండింగ్‌లో పెడుతున్నారు. నిబంధనలను కఠినంగా అమలు చేస్తుండటంతో శంషాబాద్, మొయినాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త కనెక్షన్లు జారీ నిల్చిపోయింది.

**మరెలా?** విద్యుత్తు కనీస అవసరం కాబట్టి ఒక కనెక్షన్‌ను అది కూడా తాత్కాలిక కేటగిరి-8 కింద జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకు యూనిట్‌కు రూ.12 చొప్పున వసూలు చేస్తున్నారు

# ఇంటి పెరట్లోనే గం'జాయ్'

హైదరాబాద్: ఆంధ్రా- ఒడిశా సరిహద్దులు, ఏజెన్సీ ప్రాంతాలకు పరిమితమైన గంజాయి మొక్కల సాగు నగరానికి విస్తరించడం కలకలం రేపుతోంది. మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై నిఘా పెరగడంతో కొందరు కేటుగాళ్లు ఇలా దారులు వెతుక్కుంటున్నారు. కొన్నిరోజులుగా ఇంటి పెరడు, మిద్దె, అపార్టుమెంట్ల టెర్రస్ మీద గుట్టుగా గంజాయి మొక్కలను పెంచుతూ పోలీసులు, ఆబ్కారీ శాఖ తనిఖీల్లో పట్టుబడుతున్న ఉదంతాలు వరుసగా నమోదవుతున్నాయి. అత్యాశకు పోయి కొందరు రాజధాని శివార్లలోని వ్యవసాయ భూముల్లో సాగు చేస్తూ పట్టుబడుతున్నారు. ఆబ్కారీ శాఖ గత మూడేళ్లలో రాష్ట్రంలో 21,035 మొక్కల్ని స్వాధీనం చేసుకుంది. ఈ ఏడాది అక్టోబరు వరకూ రాజధాని పరిధిలో దాదాపు 90 చోట్ల గంజాయి మొక్కలు సాగుచేస్తూ దర్యాప్తు సంస్థలకు చిక్కారు.

**అధిక ధరకు కొనలేక..**



ఉపాధి, వివిధ అవసరాల కోసం ఒడిశా సహా వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు నగరానికి వేల సంఖ్యలో వస్తుంటారు. ఇలా వచ్చేవారిలో కొందరికి మత్తు పదార్థాలు తీసుకునే అలవాటు ఉంటుంది. తాముండే ప్రాంతాల్లో తక్కువ ధరకు దొరికే గంజాయి.. హైదరాబాద్‌లో రూ.వేలల్లో ఉండడంతో సొంతంగా మొక్కలు పెంచుతున్నారు. ఉదాహరణకు ఏవోబీ దగ్గర గంజాయి కిలో రూ.5 వేలుంటే.. నగరంలో అంతకు 10 రెట్లు ధర ఉంటుంది. డిమాండ్‌ను బట్టి ధర మరింత పెరుగుతుంది. ఇంత మొత్తం చెల్లించలేక కొందరు గంజాయి విత్తనాలు తెప్పించి.. నగరంలో తాముండే ప్రాంతాల్లో పెంచుతున్నారు. ఇటీవల మలక్‌పేటలోని మహబూబ్‌మిషన్ మార్కెట్లోని భవనం టెర్రస్ మీద మొక్కలు పెంచుతూ ఇద్దరు బిహారీలు పట్టుబడడమే దీనికి నిదర్శనం. దీనికితోడు మత్తు పదార్థాలకు అలవాటుపడిన యువత కూడా ఇంటి దగ్గరే మొక్కలు పెంచుతూ పోలీసులకు చిక్కుతున్నారు. ఒక్కమొక్క బాగా పెరిగితే సుమారు 3-5 కిలోల గంజాయి వస్తుందని ఆబ్కారీ శాఖ అధికారులు చెబుతున్నారు.

# ఒకే గూటికి వరద నాలాలు



హైదరాబాద్: వరద కష్టాల నుంచి నగరాన్ని రక్షించేందుకు జీహెచ్ఎంసీ నిర్ణయం తీసుకుంది. వేర్వేరు విభాగాల ఆధ్వర్యంలోని నాలాలన్నింటినీ.. ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చింది. పురోగతిలోని పనులు మినహా.. మిగిలిన పనులన్నింటినీ వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఎన్‌డీపీ) విభాగానికి అప్పగించాలని ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేసింది.

**పూర్తయిన జీఐఎస్ సర్వే**

ఆరు నెలల కిందట వరద నాలాల జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్) సర్వే మొదలైంది. 150 డివిజన్ల పరిధిలోని పాత జీహెచ్ఎంసీ పరిధిలో ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో నాలాలను జల్లెడ పట్టారు. త్వరలోనే సర్వే నివేదిక సిద్ధం కానుంది.

**విలీన ప్రాంతాల్లోనూ..**

శివారులోని 27 పట్టణ స్థానిక సంస్థలు(యూఎల్‌బీ) జీహెచ్ఎంసీ విలీనమై.. వార్డుల సంఖ్య 300కు పెరిగింది. త్వరలోనే శివారు ప్రాంతాల్లోని వరద నాలాల సర్వేపై కమిషనర్ ఆర్వీ.కర్ణన్ నిర్ణయం తీసుకుంటారని, సమీక్షలు జరుగుతున్నాయని ఉన్నతాధికారులు తెలిపారు.

**టెండరు దశలోని పనులు సైతం..**

జీహెచ్ఎంసీ పరిధిలోని నాలాలను ప్రస్తుతం ప్రాజెక్టులు, నిర్వహణ, ఎస్ఎన్‌డీపీ విభాగాలు పర్యవేక్షిస్తున్నాయి. పని భారాన్ని దృష్టిలో ఉంచుకుని వేర్వేరు పనులను వేర్వేరు విభాగాలు చూస్తున్నాయి. రూ.650కోట్లతో చేపట్టిన రెండో దశ నాలాల నిర్మాణం.. ఏడాదైనా పట్టాలెక్కట్లేదు. ఈ నేపథ్యంలో.. ఆయా సమస్యలను నివారించి.. ప్రణాళికాబద్ధంగా పనులను పూర్తి చేసేందుకు నాలాల వ్యవస్థను పూర్తిగా ఎస్ఎన్‌డీపీకి అప్పగించాలని జీహెచ్ఎంసీ నిర్ణయం తీసుకుంది. పురోగతిలోని పనులను ప్రస్తుత విభాగాలే పూర్తి చేయాలని, అంచనాలు, ప్రణాళిక, టెండరు దశల్లోని పనులన్నీ ఎస్ఎన్‌డీపీకి అప్పగించాలని ముఖ్య ఇంజినీరు సహదేవ్ రత్నాకర్ ఇంజినీర్లను ఆదేశించారు.

అంతర్గత నాలాలు: 1,200కి.మీ

ప్రధాన నాలాలు: 390కి.మీ

# విలాసాలే లక్ష్యం.. 'మత్తు'మార్గం!



హైదరాబాద్: తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం.. పేదరికం.. చెడు స్నేహాలు యువత తప్పటడుగులు వేసేందుకు కారణాలుగా భావించేవారు. ఇటీవల సైబర్‌క్రైమ్, డ్రగ్ స్మగ్లింగ్ కేసుల్లో పట్టుబడుతున్న వారిలో అధికశాతం విద్యావంతులు, ఉన్నత ఉద్యోగులు, వ్యాపారులు ఉంటున్నారు. ఒక్క సంపాదన, ఈఎంఐలతో బతుకీడ్చటం నచ్చని వారు.. విలాస జీవితాన్ని ఆస్వాదించేందుకు అక్రమ కార్యకలాపాలను ఎంచుకుంటున్నట్టు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వస్తున్నాయి. అరెస్ట్ చేస్తున్న ప్రతి వెయ్యి మందిలో 800 మంది 25-40 ఏళ్ల మధ్య వయస్కులే. వీరందరి నోట వచ్చిన ఒకేమాట.. 40 ఏళ్ల లోపు ఆర్థికంగా స్థిరపడాలి. ఆ తర్వాత ఏ కష్టం చేయకుండా గడిపేయాలంటూ చెప్పటం ఆశ్చర్యానికి గురి చేసిందని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. నగదు స్వాధీనం చేసుకునేఅవకాశం లేకుండా క్రిప్టో రూపంలో మార్చేస్తున్నారు. విదేశాల్లోని మిత్రులను బినామీలుగా మార్చి ఆస్తులు బదిలీ చేస్తున్నారు.

**ఎంజాయ్ చేయాలని..**

చెన్నైకు చెందిన రాహుల్(31).. ఉన్నత విద్య పూర్తిచేశాడు. నెదర్లాండ్స్‌లోని ప్రముఖ కంపెనీలో భారీ వేతనంతో కొలువు సంపాదించాడు. పబ్‌లో సరదాగా తీసుకున్న డ్రగ్స్‌కు బానిసగా మార్చాయి. నెమ్మదిగా పెడ్లర్‌గా అవతారమెత్తాడు. హెరాయిన్, కొకైన్ పెద్దఎత్తున తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. రెండుచేతుల సంపాదన.. వారాంతం ఇష్టమైనచోట వినోదాల విందు. రెండేళ్లకే రూ.కోటి చేసుకున్నాడు. నగరంలోని కొనుగోలుదారులకు డ్రగ్స్ ఇచ్చేందుకువచ్చి హెచ్‌న్యూపోలీసులకు చిక్కాడు. ఇదేబాటలో ఐటీఉద్యోగి రాహుల్, డీజే సిద్దార్థ, వ్యాపారి సంజయ్ మెహ్రా, ప్రైవేట్ ఉద్యోగి జాన్సన్‌రాజ్ డ్రగ్స్, క్రిప్టో కరెన్సీ మార్పిడితో అక్రమాలకు పాల్పడుతున్నారు.

**నగదు ద్రాతో ఊచలు..**

బిహార్‌కు చెందిన రంజీ క్రికెటర్ రిషి తుషార్(30). బరోడా జట్టుకు కోచ్‌గా పనిచేస్తున్నాడు. ఇంజినీరింగ్ చదివిన ఆయన ఉద్యోగం చేస్తే వచ్చే చాలీచాలని జీతం వద్దనుకున్నాడు. గోవాలో పరిచయమైన సైబర్ నేరస్థులతో చేతులు కలిపి విదేశీ ఫోన్‌నంబర్లతో సామాజిక మాధ్యమాల గ్రూపులు రూపొందించి వేల మంది అమాయకులకు లాభాల వల విసిరి మోసాలకు సహకరించాడు. వారికి అవసరమైన బ్యాంకు ఖాతాలు సమకూర్చటం, అక్కడ జమ చేసిన నగదును క్రిప్టో, బిట్‌కాయిన్‌గా మార్చి విదేశాలకు తరలిస్తూ రూ.లక్షల సంపాదనకు అలవాటుపడ్డాడు. ఒక బ్యాంకు ఖాతా నుంచి విత్‌డ్రా చేసిన నగదు ఇతడిని సైబర్ క్రైమ్ పోలీసులకు పట్టిచ్చింది.

# పిలుస్తోంది.. ప్రకృతి ఒడి..!

కొత్తగూడెం: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం పుణ్యక్షేత్రం ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు సిద్ధమవుతోంది. డిసెంబర్ 29న కనువిందు చేసే తెప్పోత్సవం, 30న అత్యంత పవిత్రమైన ఉత్తర ద్వార దర్శనం కోసం తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలిరానున్నారు. రామయ్య దర్శనానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు పర్యాటకంగా ఆకట్టుకునే ప్రాంతాలు భద్రాద్రి జిల్లాలో కొలువై ఉన్నాయి.

**వనవాస స్మృతుల వేదిక..**

భద్రాచలం నుంచి 35కిలోమీటర్ల దూరంలో గోదావరి తీరాన వెలిసిన పర్ణశాల.. రామాయణ కావ్యాన్ని కళ్లముందుంచే ఒక అద్భుత దృశ్యం. సీతాదేవి స్నానమాచరించి తన నారచీరలను ఆరవేసిన గుర్తులు ఇక్కడి రాళ్లపై ఇప్పటికీ దర్శనమిస్తాయి. పర్ణశాల వద్ద గోదావరి నదిలో భక్తులు బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలను వీక్షించవచ్చు. పర్ణశాల సమీపంలోని 'గుండాల' వద్ద భూమిలో నుంచి వేడినీరు ఉబికి రావటం ఒక ప్రకృతి వింత. భక్తులు ఇక్కడ స్నానం చేయటాన్ని పవిత్రంగా భావిస్తారు.

**అరుదైన జంతుజాలాలకు వేదిక 'పులిగుండాల'**

పచ్చని అడవులు, అరుదైన పక్షిజాతులు, జంతువులు, ఔషధ గుణాలు కలిగిన మొక్కలు.. ఇలా ప్రకృతి అందాలకు చిరునామాగా మారాయి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కనకగిరి గుట్టలు, పులిగుండాల అటవీప్రాంతం. ఇక్కడ ఎకో టూరిజం అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. పర్యాటకులు కనకగిరి కొండ వ్యూ పాయింట్ ద్వారా ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తున్నారు.

**కనువిందు చేసే కిన్నెరసాని అందాలు**

దట్టమైన అడవులు, ఎత్తైన కొండల మధ్య నిర్మించిన కిన్నెరసాని ప్రాజెక్టు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పర్యాటకశాఖ ఇక్కడ బోటింగ్ సదుపాయాన్ని కల్పిస్తోంది. నీలిరంగు నీటిపై పడవలో ప్రయాణిస్తూ.. చుట్టూ ఉన్న కొండలను చూస్తుంటే ఏదో తెలియని ప్రశాంతత



కలుగుతుంది. జలాశయం మధ్యలో అక్కడక్కడా కనిపించే చిన్నచిన్న దీవులు ప్రకృతి ప్రేమికులకు పసందైన విందును అందిస్తాయి. కిన్నెరసాని పర్యటనలో పిల్లలు, పెద్దలను సమానంగా ఆకట్టుకునే మరో ప్రదేశం జింకల పార్కు. ఇక్కడ వందలాది జింకలు తమ సహజసిద్ధమైన వాతావరణంలో స్వేచ్ఛగా విహరిస్తుంటాయి. అద్దాలమేడ, కాటేజీల నుంచి ప్రాజెక్టును వీక్షించటం ద్వారా మధురానుభూతి పొందవచ్చు.

**మరిన్ని చూడదగిన ప్రాంతాలు..**

దుమ్ముగూడెం మండలం బొజ్జిగుప్పలో పంటపొలాలు, ఆదివాసీ ఆవాసాలు, ఆహార అలవాట్లను పరిశీలించవచ్చు. పర్యాటకుల కోసం ఇక్కడ ప్రత్యేకంగా క్యాంప్ ఫైర్, రేలా నృత్య ప్రదర్శనలు ఉండనున్నాయి. భద్రాచలంలో గిరిజన మ్యూజియం మరింత ఆకర్షణగా నిలవనుంది. ముక్కోటి వేడుకలకు వచ్చే భక్తులు.. ఆదివాసీ గిరిజనుల సంప్రదాయాలను తెలుసుకునేందుకు ఇదో చక్కని వేదిక.

భద్రాచలం గోదావరి గట్టుపైన సెల్ఫీ పాయింట్ ద్వారా గోదావరి నది అందాలను బంధించవచ్చు.

# ఇసుకంతైనా దయలేదు

నిజామాబాద్: జిల్లాలో నాలుగు నెలల కిందట కురిసిన భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగి సమీపంలోని వ్యవసాయ క్షేత్రాల్లో భారీగా ఇసుక మేటలు వేశాయి. రైతులు పంట కోల్పోవడంతోపాటు మళ్లీ సాగుచేసుకునే పరిస్థితి లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో పొలాల్లో పేరుకుపోయిన ఇసుకను ఉచితంగా తీసివేస్తామని ప్రకటించగా.. సంబంధిత అధికారులు సర్వేలు సైతం చేశారు. అనంతరం దీని ప్రస్తావనే లేకపోవడంతో ఇసుకను తొలగించడానికి కర్షకులు రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

**వేల ఎకరాల్లో..**

ఆగస్టులో కురిసిన వానలకు జిల్లాలోని 42 వేల ఎకరాల్లో పంటలు నీట మునగగా.. 12 వేల ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. మోకాలులోతు మేర పేరుకుపోయిన ఇసుకను రైతులు బ్లేడ్ ట్రాక్టర్ ద్వారా తొలగించి చేను చుట్టూ కుప్పలుగా నిల్వచేస్తున్నారు. అయినా ఇసుక ఇక్కట్లు తీరడంలేదు. అడుగుభాగంలో మళ్లీ నల్లమట్టిని తెచ్చిపోస్తున్నారు. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో యాసంగి సీజన్‌లో నాట్లేయడం కొనసాగుతుండగా.. వీరు మాత్రం తమ పొలాలు బాగు చేసుకునేందుకు అవస్థలు పడుతున్నారు.

**ఈ ప్రాంతాల్లో అధికం..**



నందిపేట్, డొంకేశ్వర్, ఆలూరు, నవీపేట, బోధన్ మండలాల్లో మంజీరా, గోదావరి నదులు, సిరికొండ, ధర్పల్లి, డిచ్‌పల్లి, భీమ్‌గల్ మండలాల్లో వాగులు ఉగ్రరూపం దాల్చడంతో భారీగా ఇసుక మేటలు వేశాయి. దీంతోపాటు బోర్లు సైతం ఇసుకలో కూరుకుపోయి కూలిపోయాయి. వీరంతా సాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. కొంతమంది రూ.లక్షల్లో ఖర్చు చేయలేక పొలాలను అలాగే వదిలేసే దయనీయ పరిస్థితి నెలకొంది.

**కుప్పలుగా చేయడానికి..**

నా పొలంలో వేసిన ఇసుక మేటలను కుప్పలుగా ఒకచోట చేర్చడానికే ఇప్పటివరకు రూ.లక్షల్లో ఖర్చయ్యింది. ఈ నిల్వలను ఎక్కడికి తీసుకెళ్లాలి. నా చేనులో పంట ఎలా పండించాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి. రాములు, కొండూరు గ్రామం, సిరికొండ

# జంట జలాశయాలు.. కాలుష్య కాసారాలు



హైదరాబాద్ : భాగ్యనగరానికి రక్షిత నీటిని అందించే జంట జలాశయాలు వ్యర్థాలతో కలుషితం అవుతున్నాయి. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లలోకి మురుగును నేరుగా విడుదల చేస్తుండటం, మానవవ్యర్థాలకు డంపింగ్ కేంద్రంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నగరంలో నీటి సరఫరాలో కీలకంగా ఉన్న జంట జలాశయాల పర్యవేక్షణపై జలమండలి ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. రోజుకు 45 ఎంజీడీల నీటిని సరఫరా చేసే సామర్థ్యం కలిగిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చుట్టుపక్కల నివాస ప్రాంతాలు అంతకంతకూ పెరుగుతుండటంతో ఆ ప్రాంతాల మురుగు నేరుగా జలాశయాల్లో చేరుతోంది. నగరంలోని కొన్ని ప్రాంతాల నుంచి తీసుకువచ్చే మానవ వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాలకు జలాశయాలు డంపింగ్‌యార్డుల్లా మారాయి. జలమండలి రెండు జలాశయాల నుంచి నేరుగా వస్తున్న నీటిని (రా వాటర్) జలమండలికి చెందిన అత్యాధునిక ప్రయోగశాలల్లో పరీక్షిస్తున్నారు. ఈ పరీక్షల్లో ఈకోలి, కోలీఫాం బ్యాక్టీరియా, ఇతర రసాయనాలు ఉంటున్నాయని గుర్తించారు. ఉస్మాన్‌సాగర్ జలాలు తొలుత ఆసిఫ్‌నగర్ ఫిల్టర్‌బెడ్‌లకు వస్తుండగా.. హిమాయత్‌సాగర్ జలాలు మీరాలం ఫిల్టర్‌బెడ్‌లకు చేరుతాయి. వచ్చిన నీటిని ప్రమాణామేరకు పూర్తిగా శుద్ధి చేసిన తర్వాత జలమండలి సరఫరా చేస్తోంది.

**పర్యవేక్షణ అంతంతమాత్రమే**

జలాశయాల నుంచి నీటిని వినియోగించుకుంటున్న జలమండలి వాటి పరిరక్షణపై పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతోనే వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. పెట్రోలింగ్ సిబ్బంది నామమాత్రంగా ఉండటంతో పలువురు వ్యర్థాలను నీటిలో పోస్తున్నారు.

**దుస్థితికి కారణాలు ఎన్నో..**

అజీజ్‌నగర్, హిమాయత్‌సాగర్ ప్రాంతాలు, ఫాంహౌస్‌లు ఇతర నివాస ప్రాంతాల్లోని మురుగునీటిని నేరుగా జలాశయాల్లోకి వదిలిపెడుతున్నారు. తాత్కాలిక కాలువలను ఏర్పాటు చేయడంతో పాటు శాశ్వతంగా సిమెంట్ కాలువలు నిర్మించి నీటిని జలాశయాల్లోకి వదిలిపెడుతున్నారు. స్థానిక సంస్థలతో పాటు ప్రైవేటు వ్యక్తులు మురుగును జలాశయాల్లో కలిపేస్తున్నారు.నగరం వెలుపల ఓఆర్‌ఆర్ సమీపంలో ప్రాంతాల్లో సెప్టిక్ ట్యాంకులు ఉన్నాయి. ఇవి నిండిన తర్వాత మానవ వ్యర్థాలను ట్యాంకర్లలో తీసుకువచ్చి జలాశయాల్లో కలిపేస్తున్నారు. బుధవారం ట్యాంకర్ ద్వారా మానవవ్యర్థాలను తెచ్చి హిమాయత్‌సాగర్‌లో వదిలిపెడుతుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రాత్రి పూట నిర్మాణ వ్యర్థాలతో పాటు ఇతర వ్యర్థాలను ట్రక్కులు, లారీల్లో తెచ్చి జలాశయాల్లో పడేస్తున్నారు.

# గుట్టుగా కొని.. సరిహద్దు దాటించి

నిర్మల్ : రాష్ట్రం, ప్రదేశాలు, పరిస్థితులను బట్టి కొన్ని వస్తువుల ధరల్లో హెచ్చుతగ్గులుంటాయి. వంటగ్యాస్ ఇదే కోవలోకి వస్తుంది. నిత్యావసరమైన గ్యాస్ ధరలు మన ప్రాంతంతో పోలిస్తే మహారాష్ట్రలో తక్కువగా ఉన్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు దళారులు గుట్టుగా గ్యాస్ సిలిండర్లను సరిహద్దు దాటిస్తున్నారు.


**అక్కడి వారి సహకారంతో..**

జిల్లాకు చెందిన కొందరు దళార్లు పొరుగు రాష్ట్రంలోని నాందేడ్, ధర్మాబాద్ ప్రాంతాల గ్యాస్ డీలర్ల సహకారంతో ఈ తంతు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. మన ప్రాంతంలోని ఖాళీ సిలిండర్లను అక్కడకు తీసుకెళ్లి వారివద్ద సిలిండర్లు తీసుకుంటున్నారు. మన ప్రాంతంతో పోలిస్తే అక్కడ గృహావసరాలకు వినియోగించే సిలిండర్ ధర రూ.51 వరకు తక్కువ కాగా, వాణిజ్య సిలిండర్ ధర రూ.170 వరకు తక్కువగా లభ్యమవుతోంది. అక్కడ పెద్దమొత్తంలో సిలిండర్లను కొనుగోలు చేస్తూ స్థానికంగా ఎక్కువ ధరతో విక్రయిస్తున్నారు.

తానూరు, కుభీరు, కుంటాల, సారంగాపూర్ మండలాల పరిధిలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలున్నాయి. వీటిలో ప్రధాన రహదారులే కాకుండా అంతర్గతంగా ఉండే అనువైన ప్రాంతాల నుంచి సిలిండర్లను తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎక్కువ వ్యాపారం జరిగే హెూటళ్లను సైతం తమ విక్రయకేంద్రాలుగా మార్చుకుంటున్నారు.

వాహనాల్లోనూ..గ్యాస్ సిలిండర్లతో నడిచే వాహనాల వినియోగమూ




ఎక్కువగానే ఉంది. ఎల్‌పీజీ ఫిల్లింగ్ కేంద్రాలతో పోలిస్తే నేరుగా సిలిండర్ నుంచి గ్యాస్ నింపుకోవడం ఖర్చు తక్కువవుతుంది. అద్దెకార్లు తిప్పేవారు ఎక్కువగా ఇలా రాయితీపై వచ్చే సిలిండర్లను తమ అవసరాలకు వాడుతున్నారు.

**నెలకు రూ.3 లక్షలకు పైగా వ్యాపారం**

ప్రధానంగా 14.2 కిలోలు, 19 కిలోల సిలిండర్లను ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. సగటున రోజుకు 80 వరకు గృహావసర సిలిండర్లు, 40 వరకు వాణిజ్య సిలిండర్లు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన రోజుకు రూ. 10,800, నెలకు రూ. 3.24 లక్షలు చొప్పున వారికి గిట్టుబాటవుతోంది. ఇందులో రవాణా, ఇతరత్రా ఖర్చులు పోయినా 2 లక్షలకు పైగానే వెనకేసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

**ఆపేవారెవరు**సరిహద్దు ప్రాంతాల్లో గతంలో ఉన్న తనిఖీ కేంద్రాల ఎత్తివేత కూడా వీరికి కలిసొచ్చినట్లయ్యింది. అడిగేవారు, ఆపేవారు లేకపోవడంతో చాలా సులభంగా సరిహద్దు దాటిస్తున్నారు. పరిశీలించి చూస్తే తప్ప వేబిల్లు, పన్ను చెల్లింపుల వ్యవహారం గుర్తించడం కష్టం.

# అదే పనిగా మోగుతోందా..!

హైదరాబాద్: పాత డీజిల్ జనరేటర్లను వినియోగిస్తుండటంతో నగర వాయు నాణ్యతపై తీవ్ర ప్రభావం పడుతోంది. కార్పొరేట్ కార్యాలయాలు, ఫంక్షన్‌హాళ్లు, ఎత్తైన భవనాలు, షాపింగ్‌మాళ్లలో పది నుంచి పదిహేనేళ్ల కిందటి డీజీసెట్‌లు దర్శనమిస్తున్నాయి. సీపీసీబీ మార్గదర్శకాలకు విరుద్ధంగా వాటిని వాడుతుండటంతో సూక్ష్మధూళి కణాలైన పీఎం 2.5, పీఎం 10, నైట్రోజన్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోకార్బన్, సల్ఫర్ డయాక్సైడ్‌లు విడుదలవుతున్నాయి.**నిబంధనలు ఏం చెబుతున్నాయి..**తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఉత్తర్వుల ప్రకారం.. 61 కిలోవాట్‌కు పైగా సామర్థ్యం ఉన్న డీజీసెట్లపై రెట్రోఫిటెడ్ ఎమిషన్ కంట్రోల్ డివైస్(ఆర్ఈసీడీ)ని అమర్చడం గానీ, గ్యాస్ ఆధారిత జనరేటర్లకు మారడం గానీ చేయాలి.. మార్చి 20నుంచి ఈ నిబంధనలు అమలులోకి వచ్చాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్వహించిన ఎమిషన్ ఇన్వెంటరీ, సోర్స్ అపోర్షన్‌మెంట్, క్యారీయింగ్ కెపాసిటీ అధ్యయనాల ప్రకారం డీజిల్ ఇంజిన్ ఉద్గారాలు పీఎం 2.5, కార్సినోజెనిక్ పాలీ యారోమాటిక్ హైడ్రోకార్బన్లకు కారణమవుతున్నాయని తేలింది. ఇది నగరవాసుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది.

సీపీసీబీ ఆమోదించిన 5ల్యాబ్‌లలో టైప్ అప్రూవ్డ్ ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించాలి.

ఆర్ఇసీడీ పనితీరును నిర్ధారించడానికి రియల్ టైమ్ మానిటరింగ్ వ్యవస్థ (15 నిమిషాలకోసారి డేటా ట్రాన్స్‌ఫర్) తప్పనిసరి. ఈ డేటాను టీజీపీసీబీ సర్వర్‌కు అనుసంధానించాలి.నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఎయిర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ 1981, ఎన్విరాన్‌మెంట్ (ప్రొటెక్షన్)యాక్ట్ 1986 ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తారు.




అమరావతి: కాకినాడ జిల్లా సార్లంకపల్లెలో జరిగిన అగ్నిప్రమాదంపై మంత్రులు, అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సంక్రాంతి పండుగ సమయంలో ఈ అగ్నిప్రమాదం విషాదాన్ని తెచ్చిందన్నారు. గ్రామంలో ఉన్న 38 తాటాకు ఇళ్లు కాలిపోయాయని.. బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు.

బాధిత కుటుంబాలకు అందిస్తున్న సాయాన్ని హోంమంత్రి అనిత, ఇతర అధికారులు ఆయనకు వివరించారు. తక్షణసాయంగా ఒక్కో కుటుంబానికి రూ.25వేల నగదు అందజేస్తున్నామని తెలిపారు. ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి కొత్త ఇల్లు మంజూరు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. అప్పటివరకు వారికి అవసరమైన వసతి, ఇతర సహాయం అందించాలన్నారు. ప్రమాదంలో కాలిపోయిన డాక్యుమెంట్లు, ఆధార్ కార్డులు ఇచ్చేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

బాధితులకు అందే సాయంపై మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని సూచించారు.




వాషింగ్టన్: తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఇరాన్‌కు పిడుగులాంటి వార్త. రెండు వారాలకు పైగా పౌరులు వీధుల్లో తీవ్ర నిరసనలు కొనసాగిస్తున్న వేళ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌తో వాణిజ్యం జరిపే అన్ని దేశాలపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుందన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్టు చేశారు. ఇరాన్‌తో ఎక్కువగా వాణిజ్యం చేసే దేశాల్లో చైనా, తుర్కియే, యూఏఈ, ఇరాక్, భారత్ ఉన్నాయి. ఇరాన్ నిరసనలపై ట్రంప్ సైనిక చర్య చేపడతారనే ఊహాగానాల నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. ఇరాన్‌పై చర్యల్లో భాగంగా ఆ దేశంపై వైమానిక దాడులు చేపట్టడం ఒక ఆప్షన్ కావొచ్చని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ఇప్పటికే పేర్కొన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటడం, కరెన్సీ విలువ భారీగా పతనమవడంతో గతనెల 28 నుంచి ఇరాన్‌వ్యాప్తంగా నిరసనలు ప్రారంభమయ్యాయి. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు 646 మంది ప్రాణాలు కోల్పోయారు.

**ఇరాన్‌ను వీడండి..** మరోవైపు, ఇరాన్‌లోని అమెరికా పౌరులకు అగ్రరాజ్య ప్రభుత్వం అడ్వైజరీ జారీ చేసింది. ఉద్రిక్తతలు మరింత హింసాత్మకంగా మారే అవకాశం ఉందని, తక్షణమే ఆ దేశాన్ని వీడాలని తమ పౌరులను హెచ్చరించింది.

ఒకవేళ దేశం నుంచి బయటకు రాలేని పరిస్థితుల్లో ఉంటే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించింది. ఇరాన్‌పై అమెరికా వైమానిక దాడులు చేపట్టే అవకాశాలున్నట్లు వార్తలు వస్తోన్న వేళ ఈ హెచ్చరికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**అతడికి మరణశిక్ష..?...** ఇదిలాఉండగా.. ఖమేనీకి వ్యతిరేకంగా నిరసనకారులపై ఉక్కుపాదం మోపుతోన్న ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆందోళనల్లో పాల్గొన్న 26 ఏళ్ల ఇర్ఫాన్ సోల్తానికి మరణశిక్ష అమలుచేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. జనవరి 8న టెహ్రాన్ శివారు ప్రాంతంలో ఇర్ఫాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. జనవరి 14న అతడిని ఉరితీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు మానవహక్కుల సంఘాలు, మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.




**చౌటుప్పల్ గ్రామీణం: హైదరాబాద్-విజయవాడ హైవేపై సంక్రాంతి రద్దీ కొనసాగుతోంది. ఏపీ వైపు పెద్ద ఎత్తున వాహనాలు వెళ్తున్నాయి. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజాతో పాటు పెదకాపర్తి, చిట్యాల వద్ద నెమ్మదిగా ముందుకు సాగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున భారీ సంఖ్యలో వాహనాలు పంతంగి టోల్‌ప్లాజా మీదుగా వెళ్లాయి.**




## దుర్గమ్మ భక్తులకు గుడ్‌న్యూస్.. ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారా సేవలు..

విజయవాడ : ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యం కల్పించే దిశగా దేవాదాయ శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. భక్తుల కోసం ఆన్‌లైన్ సేవలను అధికారికంగా ప్రారంభించింది. దర్శన టిక్కెట్లు, సేవా పూజలు, ప్రసాదం, వసతి గదుల బుకింగ్ వంటి అనేక సేవలను ఇకపై ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చని తెలిపింది. క్యూలైన్లలో వేచి ఉండే సమయాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ డిజిటల్ సేవలను ప్రవేశపెట్టినట్లు దేవాదాయ శాఖ పేర్కొంది. నగదు రహిత చెల్లింపులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందని వెల్లడించింది. 'మన మిత్ర' వాట్సాప్ సేవలు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది.

**వాట్సాప్ ద్వారా..** వాట్సాప్ నంబర్ 9552300009ను వినియోగించుకోవాలని సూచించింది. దర్శనం, ప్రసాదం, పూజా సేవల వివరాలు వాట్సాప్ ద్వారా అందుబాటులో ఉంటాయని తెలిపింది. అధికారిక వెబ్‌సైట్ ద్వారా ముందస్తు బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించింది. భక్తులు తమకు కావాల్సిన వివరాల కోసం వెబ్‌సైట్ : www.aptemples.ap.gov.in లో సంప్రదించాలని సూచించింది. శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం టిక్కెట్లు ఆన్‌లైన్‌లో లభ్యమవుతాయని వెల్లడించింది.

**ఆర్జిత సేవలు..** అమ్మవారికి నిర్వహించే ఆర్జిత సేవలు ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా పొందవచ్చని చెప్పుకొచ్చింది. దేవస్థాన వసతి గదుల కేటాయింపు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపింది. ఇంద్రకీలాద్రి ప్రాంగణంలో ప్రత్యేక డిజిటల్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.క్యూఆర్ కోడ్, కార్డ్, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లింపుల సౌకర్యం కల్పిస్తున్నట్లు స్పష్టం చేసింది. దళారులను నమ్మవద్దని దేవస్థానం అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వం కల్పించిన అధికారిక సేవలనే వినియోగించుకోవాలని దేవస్థానం అధికారులు విజ్ఞప్తి చేశారు.




చంద్రగిరి: ఏపీ సీఎం చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సంబరాల్లో సీఎం చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, నారా బ్రాహ్మణి, దేవాంశ్, బాలకృష్ణ సతీమణి వసుంధర, తేజస్విని, శ్రీభరత్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను భువనేశ్వరి, బ్రాహ్మణి పరిశీలించారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటుచేసిన వివిధ క్రీడా పోటీల్లో దేవాంశ్ పాల్గొన్నాడు. ఆయా పోటీలను సీఎం, కుటుంబసభ్యులు తిలకించారు.

అనంతరం విజేతలకు చంద్రబాబు, భువనేశ్వరి బహుమతులు అందజేశారు. అంతకుముందు ప్రజల నుంచి వినతిపత్రాలను సీఎం స్వీకరించారు.



## ఈ ఏడాది ఆర్టీసీ ఛార్జీలు పెంచం: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అమరావతి: ఈ ఏడాది ఆర్టీసీ ఛార్జీల్లో ఎలాంటి పెంపు లేదని ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా అదనపు ఛార్జీలు పెంచబోమని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగుతోందన్నారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించేవారు క్షేమంగా సొంతూళ్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ బస్సులు అక్రమంగా ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

## ప్రభుత్వ లాంఛనాలతో గుండ అప్పల సూర్యనారాయణ అంత్యక్రియలు.. సీఎం ఆదేశాలు..



శ్రీకాకుళం, జనవరి 13 : మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు గుండ అప్పల సూర్యనారాయణ తుదిశ్వాస విడిచారు. తలకు గాయం కావడంతో చికిత్స పొందుతూ ఆయన సోమవారం కన్నుమూశారు. ఆ మృతిపై ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు.

**అంత్యక్రియలకు హాజరు కావాలి..** సూర్యనారాయణ అంత్యక్రియలకు టీడీపీ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు హాజరు కావాలని సీఎం ఆదేశించారు. ఈ క్రమంలోనే వారి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు సీఎం చంద్రబాబు. ఈ సందర్భంగా సూర్యనారాయణతో తనకు ఉన్న అనుబంధాన్ని సీఎం గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నా.. ఎప్పుడూ ఆయన సాధారణ జీవితం గడిపారని కొనియాడారు. నిజాయితీగా ఎంతో ఆదర్శవంతమైన రాజకీయాలు చేసిన సూర్యనారాయణ అందరికీ ఆదర్శమని కీర్తించారు. టీడీపీకి సూర్యనారాయణ చేసిన సేవలు ఎప్పుడూ మరిచిపోమని, వారి కుటుంబంపై తనకు అత్యున్నత గౌరవం ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.




గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునే దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. తాజాగా రిపబ్లికన్ పార్టీకి చెందిన చట్టసభ సభ్యుడు రాండీ ఫైన్ 'గ్రీన్‌లాండ్ విలీనం - రాష్ట్ర హోదా' పేరుతో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుతో ఆ ద్వీపాన్ని అమెరికాలో విలీనం చేసుకునేలా ట్రంప్ చర్యలు చేపట్టేందుకు అవకాశం లభిస్తుందని రాండీ అభిప్రాయం వ్యక్తంచేశారు. అమెరికా విరోధులు ఆర్కిటిక్‌లో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని, తాము అలా జరగనివ్వబోమని వ్యాఖ్యలు చేశారు. ఆర్కిటిక్‌లో రష్యా, చైనాను ఎదుర్కోవడానికి ఈ చర్యలు కీలకమని వెల్లడించారు. వెనెజువెలా మాజీ అధ్యక్షుడు మదురో నిర్బంధం తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. గ్రీన్‌లాండ్‌పై కన్నేశారు. ఆ ద్వీపాన్ని డెన్మార్క్ నుంచి దూరం చేసేందుకు.. అక్కడి ప్రజలకు డబ్బును ఎరగా వేయాలని యోచిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఒక్కో వ్యక్తికి 10వేల డాలర్ల నుంచి లక్ష డాలర్ల (భారత కరెన్సీలో రూ.8 లక్షల నుంచి రూ.89 లక్షల) మధ్య డబ్బు ఇచ్చేందుకు అమెరికా అధికారులు ప్రతిపాదనలు చేసినట్లు తెలుస్తోంది. అలాగే ఇంకో 20 రోజుల్లో ఈ ద్వీపం గురించి మాట్లాడదామంటూ ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. యూఎస్ నగదు చెల్లింపు ప్రణాళికలను గ్రీన్‌లాండ్ నాయకులు తిరస్కరించారు. తమ ప్రాంత భవిష్యత్తును విదేశాలు నిర్ణయించలేవని గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ పేర్కొన్నారు. నాటో దేశాలు కూడా యూఎస్ ప్రణాళికపై ఆందోళన వ్యక్తంచేశాయి. ఈ ద్వీపంలో మొత్తం 57 వేల మంది ప్రజలు ఉన్నారు.

## కిక్కిరిసిన భీమవరం! - ఉమ్మడి పశ్చిమకు సంక్రాంతి కళ

భీమవరం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పండుగ సందడి స్పష్టంగా కనిపిస్తోంది. దూర ప్రాంతాల నుంచి స్వస్థలాలకు వస్తున్నవారి వాహనాలతో రోడ్లు రద్దీగా మారుతున్నాయి. ప్రధానంగా భీమవరం పట్టణంలో ఎటు చూసినా వాహనాల రద్దీ కనిపిస్తోంది. పొరుగు రాష్ట్రాలో ఉండే స్థానికులతోపాటు, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వంటి ప్రాంతాల నుంచి కేవలం పండగ కోసం వస్తున్న వాహనాలతో పట్టణం కిక్కిరిసింది. ఇవికాకుండా పండుగ నేపథ్యంలో చుట్టు ప్రాంతాల నుంచి షాపింగ్‌లకు వచ్చేవారి వాహనాలు అదనం. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో పండగ అంటే ముందుగా గుర్తొచ్చేది భీమవరమే!. కోడిపందాలు, సంక్రాంతి సంబరాలకు ఏటా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది వస్తుంటారు. ఈ ఏడాదికూడా ముందుగానే హోటళ్లు బుక్ చేసుకున్నవారు వాహనాలతో తరలివస్తుండడంతో పట్టణమంతా సందడి నెలకొంది.



## వివేకా హత్య కేసు.. సుప్రీంకోర్టులో సునీత మరో అప్లికేషన్



దిల్లీ: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఆయన కుమార్తె సునీత సుప్రీంకోర్టులో మరో అప్లికేషన్ దాఖలు చేశారు. సీబీఐ విచారణ కొసాగింపునకు ట్రయల్ కోర్టు పాక్షికంగా అనుమతివ్వడాన్ని సవాల్ చేస్తూ ఆమె సుప్రీంను ఆశ్రయించారు. సీబీఐ విచారణ అంశంపై నిర్ణయం తీసుకోవాలని హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టును గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. మూడు నెలల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ సుందరేశ్ ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. కేవలం ఇద్దరి పాత్రపై మాత్రమే విచారణ జరపాలని పాక్షికంగా ఆదేశాలు ఇచ్చింది. తాము లేవనెత్తిన అంశాలకు విరుద్ధంగా పాక్షిక విచారణకు ట్రయల్ కోర్టు ఆదేశాలిచ్చిందని.. ధర్మాసనం ఇచ్చిన మార్గదర్శకాలను పట్టించుకోలేదని సుప్రీంకోర్టు దృష్టికి సునీత తీసుకెళ్లారు. దీంతో ప్రస్తుత అప్లికేషన్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని పిటిషన్లపై విచారణను అత్యున్నత న్యాయస్థానం వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.




## చీరకట్టు.. పూల జడ.. ఆకట్టుకుంటున్న అమైరా దస్తూర్!

ఇండియన్ మోడల్.. సినీ హీరోయిన్ అయినటువంటి అమైరా దస్తూర్ ఎప్పటికప్పుడు తన హాట్ అందాలతో కుర్రకారుకు సెగలు పుట్టిస్తూ ఉంటుంది. హిందీ సినిమాల ద్వారా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. ప్రస్తుతం సినిమాల్లో అవకాశాల కోసం ఎదురు చూస్తోంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఎల్లో కలర్ శారీలో ఫోటోలను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.. తాజాగా అమైరా దస్తూర్ ఎల్లో కలర్ శారీ ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. ఇందులో అమైరా దస్తూర్ ఎల్లో కలర్ శారీతో పాటు తన పూల జడతో హైలెట్ అయింది. ముఖ్యంగా మల్లెపూలతో హెయిర్ స్టైల్ చేయించుకున్న ఈ ముద్దుగుమ్మని వెనక నుండి చూస్తే అచ్చు తెలుగు ఆడపిల్లలాగే కనిపిస్తోంది. ఇక స్లీవ్ లెస్ బ్లౌజ్ తో అందాలు హైలైట్ అయ్యేలా ఈ ముద్దుగుమ్మ తన శారీ ఫోటోలను ఇంస్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. ఈ శారీలో అమైరా దస్తూర్ మరింత అందంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ చూసిన చాలామంది నెటిజన్స్ ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తూ అందవే దిగివచ్చినట్లు ఉంది అన్నట్లుగా కామెంట్లు పెడుతున్నారు. తన నడుము ఒంపు సొంపులు చూపిస్తూ ఫోటోలకు



ఫోజులు ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారగా.. చాలామంది ఈ ఫోటోలు చూసి పలు కామెంట్లు పెడుతున్నారు.. అమైరా దస్తూర్ పర్సనల్ సినీ కెరియర్ విషయానికి వస్తే.. మోడలింగ్ ద్వారా సినిమాల్లోకి వచ్చిన ఈ ముద్దుగుమ్మ 2013లో వచ్చిన బాలీవుడ్ మూవీ ఇసాక్ తో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత హిందీ తో పాటు తెలుగు,తమిళ సినిమాల్లో కూడా నటించింది. ఇక అమైరా దస్తూర్ సందీప్ కిషన్ హీరోగా నటించిన మనసుకు నచ్చింది అనే మూవీతో టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చింది. అలాగే రాజ్ తరుణ్ హీరోగా వచ్చిన రాజుగాడు మూవీ లో కూడా హీరోయిన్ గా నటించింది.. ఆ తర్వాత మళ్లీ తెలుగు సినిమాల్లో కనిపించలేదు. ఇక బాలీవుడ్ లో కొన్ని సినిమాల్లో నటించిన అమైరా దస్తూర్ చివరిగా తమిళంలో వచ్చిన భగీరా అనే సినిమాలో కనిపించింది.. అంతేకాకుండా పలు వెబ్ సిరీస్ లలో కూడా చేసింది. అలా సినిమాలు,వెబ్ సిరీస్ లు అంటూ ఇండస్ట్రీలో కొనసాగిన ఈ ముద్దుగుమ్మకి గత రెండు మూడు సంవత్సరాలు నుండి సినిమాల్లో ఎక్కువగా ఆఫర్స్ రావడం లేదు. అందుకే సినిమాల్లో ఆఫర్స్ అందుకోవడం కోసం ఇలా సోషల్ మీడియానే ప్రధానాయుధంగా మలుచుకొని తన ఫోటోలతో దర్శక నిర్మాతలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. మరి ఈ హీరోయిన్ అందాలు చూసైనా సినిమాల్లో ఏవైనా అవకాశాలు వస్తాయా అనేది చూడాలి.

## మమితా మరో సాయి పల్లవి అవ్వాలంటే..?

కొంతమంది హీరోయిన్స్ కి స్టార్ రేంజ్ వచ్చినా అది వాళ్ల గ్లామర్ తోనే అని తెలుస్తుంది. గ్లామర్ షోతో అలరించే భామలు కొందరైతే కేవలం తమ అభినయంతో మెప్పించే వారు ఇంకొంతమంది ఉంటారు. అలాంటి వారిలో మలయాళ భామ మమితా బైజు కూడా వస్తుంది. మమితా బైజు మలయాళ పరిశ్రమలో ఏడేళ్ల నుంచి సినిమాలు చేస్తుంది. ఐతే ప్రతి సినిమాలో మమితా తన టాలెంట్ తో అలరిస్తూ వస్తుంది. ప్రేమలు సినిమాతో ఆమె సౌత్ ఆడియన్స్ అందరికీ బాగా దగ్గరైంది. ప్రేమలు సినిమా తెలుగు ఆడియన్స్ కు కూడా బాగా నచ్చేసింది. అందుకే ఆమెను తెలుగు ప్రేక్షకులు కూడా ఇష్టపడుతున్నారు.

**ప్రదీప్ రంగనాథన్ తో డ్యూడ్..** ఐతే తెలుగులోనే కాదు తమిళంలో కూడా మమితాకు మంచి క్రేజ్ ఏర్పడింది. ఆల్రెడీ అమ్మడు అక్కడ సినిమాలు చేస్తుంది. దళపతి విజయ్ జన నాయగన్ తో సినిమా చేస్తున్న మమితా లేటెస్ట్ గా ప్రదీప్ రంగనాథన్ తో డ్యూడ్ లో ఆకట్టుకుంది. డ్యూడ్ సినిమాలో ఆమె రోల్ చూసిన ఆడియన్స్ మరోసారి మమితా ప్రేమలో పడిపోతున్నారు. ప్రతి పాత్ర కథ



విన్నప్పుడు ఎలా ఉన్నా తన అభినయంతో మెస్మరైజ్ చేస్తుంది మమితా బైజు. అందుకే ఆమెను సహజ నటిగా పొగిడేస్తున్నారు ఆడియన్స్. ఇక కొందరైతే మమితాను సాయి పల్లవితో పోల్చేస్తున్నారు. సాయి పల్లవి కూడా అంతే కేవలం పాత్ర ప్రాధాన్యత ఉంది అనిపిస్తే చాలు అది ఎలాంటి సినిమా అయినా చేస్తుంది. ఐతే సాయి పల్లవి తన కెరీర్ లో చాలా ప్రయోగాలు చేసింది. కానీ మమితా ఇప్పుడే కెరీర్ మొదలు పెట్టింది కాబట్టి ఆమెకు ఇంకా అలాంటి ఛాన్స్ లు రాలేదు. కచ్చితంగా సౌత్ ఆడియన్స్ మమితా మీద చూపిస్తున్న ప్రేమ చూస్తుంటే సాయి పల్లవి తర్వాత ఆమె అనిపించేలా క్రేజ్ తెచ్చుకుంటుంది.

**అభినయంతో ఆడియన్స్ ని మెప్పిస్తూ..** మమితా కూడా ఆడియన్స్ లో తనపై ఉన్న నమ్మకాన్ని తగ్గించకూడదని ఫిక్స్ అయ్యింది. గ్లామర్ షో చేయడం వల్ల సినిమా ఛాన్స్ లు వస్తాయేమో కానీ ఒక ఐదారు సినిమాల తర్వాత బోర్ కొట్టేస్తారు. కానీ అభినయంతో ఆడియన్స్ ని మెప్పిస్తూ.. సినిమా సినిమాకు.. ప్రతి పాత్రలో కొత్తగా కనిపిస్తే మాత్రం వాళ్లకి ఎక్కువ కెరీర్ ఉంటుంది. సో మమితాకు కచ్చితంగా మలయాళం మాత్రమే కాదు మిగతా సౌత్ భాషల్లో కూడా మంచి ప్రేక్షకాదరణ లభిస్తుందని చెపడంలో సందేహం లేదు.

తెలుగులో వెంకీ అట్లూరి సూర్య సినిమాలో మమితా హీరోయిన్ గా సెలెక్ట్ అయ్యింది. ఆ సినిమాతో మరోసారి తెలుగు, తమిళ ప్రేక్షకులను అలరించనుంది అమ్మడు.

## ఓటీటీలో 'కానిస్టేబుల్ కనకం: సీజన్2' రికార్డు..




తొలి సీజన్‌ను మించి ట్విస్ట్‌లతో ఓటీటీ ప్రేక్షకులను అలరిస్తోంది 'కానిస్టేబుల్ కనకం: సీజన్2'. వర్ష బొల్లమ్మ, మేఘ లేఖ, రాజీవ్ కనకాల తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌కు ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహించారు.

ఇటీవల తెలుగు ఓటీటీ వేదిక 'ఈటీవీ విన్'లో స్ట్రీమింగ్‌కు వచ్చిన సీజన్2 తక్కువ సమయంలోనే రికార్డు వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఇప్పటివరకూ 100ం మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్‌తో రికార్డు సృష్టించినట్లు ఈటీవీ విన్ తెలిపింది. ఈ సందర్భంగా ఓ బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఇప్పటివరకూ ఎవరైనా సీజన్-1 చూడకపోతే, ఎలాంటి సబ్‌స్క్రిప్షన్ లేకుండా అన్ని ఎపిసోడ్స్ ఉచితంగా చూడొచ్చు. ఇక కొత్తగా చందా తీసుకునేవాళ్లకూ ఓ ఆఫర్ ఇచ్చింది. నెలవారీ చందాపై 'ఔ×చీ50' కోడ్‌ను ఉపయోగించి రూ. 50 రాయితీ పొందవచ్చు. అలాగే వార్షిక ప్రీమియం తీసుకోవాలనుకుంటే, 'WIN100' కోడ్‌తో రూ. 100 డిస్కౌంట్ పొందవచ్చు. దీని ద్వారా ప్రీమియం ప్లస్ ప్యాక్‌ను పొందే అవకాశం లభిస్తుంది.

**ఇంతకీ కథేంటంటే..** శ్రీకాకుళం జిల్లా రేపల్లె గ్రామ సమీపంలోని అడవిగుట్ట వైపు వెళ్లిన మహిళలు కనిపించకుండా పోతారు. ఆ మిస్టరీని మహిళా కానిస్టేబుల్ కనక మహాలక్ష్మీ అలియాస్ కనకం (వర్ష బొల్లమ్మ) ఛేదిస్తుంది. అయితే, తన ప్రాణానికి ప్రాణమైన స్నేహితురాలు చంద్రిక (మేఘ లేఖ) ఆచూకీని మాత్రం కనుగొనలేకపోతుంది. అందరూ చంద్రిక చనిపోయిందని అనుకుంటారు.

పోలీసులు కూడా ఆ కేసును సీపీ ఆఫీస్‌కు పంపేస్తారు. అయితే, చంద్రిక బతికే ఉందని కనకం బలంగా నమ్ముతుంది. మరి కనకం భావిస్తున్నట్లు చంద్రిక బతికే ఉందా? ఉంటే ఎక్కడ ఉంది? ఆ మిస్టరీని కనకం ఎలా ఛేదించింది? అన్నదే సీజన్-2 కథ.

## ఆయన వల్ల నా లైఫ్ లో బిజీగా ఉన్నా




లైఫ్ లో ఎప్పుడేం జరుగుతుందో ఎవరూ చెప్పలేం. అందుకే లైఫ్ ఈజ్ అన్‌ప్రెడిక్టబుల్ అంటుంటారు. సినీ ఇండస్ట్రీలో ఆ ప్రిడిక్షన్ ఇంకా దారుణంగా ఉంటుంది. ఎవరెప్పుడు ఎలా మారిపోతారో ఎవ రూ చెప్పలేం. ఒక్క ఛాన్స్ కొందరి లైఫ్ ను వెనక్కి తిరిగి చూసుకునే పన్లేకుండా మార్చేస్తే, అదే ఛాన్స్ మరికొందరి లైఫ్ ను తలకిందులు చేస్తుంది.

**సీరియల్స్ నుంచి సినిమాల వరకు..** తన లైఫ్ కూడా అలా ఒక్క ఛాన్స్ తోనే మొత్తం మారిపోయిందని చెప్తున్నారు నటి హరితేజ. తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు హరితేజ ఎవరో కొత్తగా పరిచయం చేయనక్కర్లేదు. పలు సీరియల్స్, టీవీ షోల్లో నటించిన హరి తేజ, బిగ్ బాస్ రియాలిటీ షో తో ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. బిగ్ బాస్1 ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని పాపులరయ్యారు హరితేజ.

**అ..ఆలో పనిమనిషి పాత్రలో..** సీరియల్స్ తో పాటూ వంటల షో కు హోస్ట్ గా వ్యవహరించిన హరి తేజ ఇప్పుడు ఎక్కువగా సినిమాలపైనే ఫోకస్ చేశారు. ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్న హరి తేజకు వరుస అవకాశాలు రావడానికి కారణం డైరెక్టర్ త్రివిక్రమేనని ఆమె చెప్తున్నారు. అ..ఆ సినిమాలో త్రివిక్రమ్ పని మనిషి క్యారెక్టర్ ఇవ్వడం వల్ల తన లైఫ్ మొత్తం మారిపోయిందని హరితేజ తెలిపారు.

**వారమైనా ఫోన్ రాలేదు...** త్రివిక్రమ్ పని మనిషి క్యారెక్టర్ కోసం వెతుకుతున్న టైమ్ లో ఓ రోజు టీవీ చూస్తున్నప్పుడు వంటల షోలో తనను చూసి, ఆ జోక్స్, కామెడీ విని ఈ అమ్మాయిని తీసుకురమ్మని తన టీమ్ కు చెప్పారని, తనకు ఫోన్ చేసి త్రివిక్రమ్ సినిమా అని చెప్పగానే షాకయ్యానని హరితేజ చెప్పారు. కానీ ఆ క్యారెక్టర్ కోసం ఆడిషన్ ఇచ్చాక తనకు ఏమీ చెప్పలేదని, వారం రోజులయ్యాక ఇక ఆఫర్ పోయినట్టేలే అనుకుంటున్న టైమ్ లో ఫోన్ చేసి డేట్స్ కావాలని అడిగారని, కనీసం కథేంటో కూడా అడక్కుండానే తాను ఆ సినిమాకు ఒప్పుకున్నట్టు హరితేజ చెప్పారు. అ..ఆ మూవీ చేసేటప్పుడే ఈ సినిమా తర్వాత తన లైఫ్ మారిపోతుందని చెప్పారని ఆమె పేర్కొన్నారు.

## రెడ్ గౌన్‌లో రకుల్.. గ్లామర్‌తో కట్టిపడేస్తోందిగా..

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తనకంటూ ఓ ప్రత్యేకమైన ఫాలోయింగ్ సంపాదించుకున్న బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్. నటనతోనే కాకుండా తన ఫిట్‌నెస్, యూనిక్ స్టైల్ స్టేట్ మెంట్లతో ఎప్పుడూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంటుంది. లేటెస్ట్ గా ఆమె షేర్ చేసిన ఫొటోలు ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నాయి. లేటెస్ట్ ఫొటోషూట్‌లో రకుల్ స్ట్రాప్ లెస్ రెడ్ గౌన్‌లో మెరిసిపోయింది. థై హై స్లిట్‌తో ఉన్న ఈ స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో ఎంతో గ్లామరస్‌గా కనిపిస్తోంది. "ఈ అవుట్‌ఫిట్, ఈ సాంగ్‌తో ప్రేమలో పడిపోయా" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్‌ను బట్టి ఈ లుక్‌ను ఎంతగా ఇష్టపడిందో అర్థమవుతోంది.



ఆమె పోజులకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో టాలీవుడ్‌లో బ్రేక్ అందుకున్న రకుల్, ఆ తర్వాత 'నాన్నకు ప్రేమతో', 'సరైనోడు' వంటి వరుస హిట్లర్లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తెలుగులో టాప్ లీగ్‌లో ఉండగానే బాలీవుడ్‌పైనా దృష్టి సారించి, అక్కడ కూడా వరుస ఆఫర్లతో తనకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకుంది. ప్రస్తుతం రకుల్ కెరీర్ సౌత్, నార్త్ అనే తేడా లేకుండా ఫుల్ స్వింగ్‌లో కొనసాగుతోంది. ఆమె చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. ముఖ్యంగా, కమల్ హాసన్, శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ఇండియన్ 3' లో కూడా రకుల్ కీలక పాత్ర పోషిస్తోంది. అయితే ఈ సినిమా ఇంకా హోల్డ్ లోనే ఉంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం రకుల్ ఎప్పుడూ చురుగ్గా ఉంటుంది. తన లేటెస్ట్ ఫొటోషూట్లు, ఫిట్‌నెస్ అప్‌డేట్లతో ఫ్యాన్స్‌కు నిత్యం టచ్‌లో ఉంటూ తన క్రేజ్‌ను ఏమాత్రం తగ్గకుండా చూసుకుంటోంది.

## కీర్తి సురేష్ బయోపిక్ టైటిల్ అది పెట్టాలట..!

మహానటి సినిమాతో తనలోని మహానటిని ప్రేక్షకులకు పరిచయం చేసి అవార్డులను సైతం అందుకుంది కీర్తి సురేష్. మలయాళంలో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న కీర్తి సురేష్ తెలుగు, తమిళ భాషల్లో సినిమాలు చేస్తూ స్టార్ క్రేజ్ తెచ్చుకుంది. లాస్ట్ ఇయర్ బేబీ జాన్ సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ కూడా ఇచ్చింది కీర్తి సురేష్. ఇక రీసెంట్ గా అమ్మడు ఒక ఇంటర్వ్యూలో తన బయోపిక్ తీస్తే ఎలాంటి టైటిల్ పెట్టాలో చెప్పింది. సీనియర్ యాక్టర్ జగపతి బాబు హోస్ట్ గా ఒక స్పెషల్ చిట్ చాట్ షో నిర్వహిస్తున్నారు.

**పెళ్లి తర్వాత కీర్తి సురేష్..** ఈ చిట్ చాట్ లో ఇప్పటికే చాలామంది స్టార్స్ అటెండ్ అయ్యారు. రీసెంట్ గా కీర్తి సురేష్ కూడా ఆ షోకి వచ్చింది. షోలో జగ్గు భాయ్ ప్రశ్నలకు కీర్తి సురేష్ తెలివైన సమాధానాలు ఆడియన్స్ ని అలరించాయి. ఇక ఈ క్రమంలో సావిత్రి



గారి బయోపిక్ మహానటిలో నువ్వు చేశావ్.. నీ బయోపిక్ చేస్తే దానికి ఏ టైటిల్ పెట్టాలని నువ్వు అనుకుంటున్నావ్ అంటే కాస్త ఆలోచించి ప్రసిద్ధి అని చెప్పింది కీర్తి. అంటే తన పేరులోని కీర్తి ప్రతిష్ట ప్రసిద్ధి ఇలా వాటికి సూటయ్యేలా టైటిల్ ఎంపిక చేసుకుందన్నమాట. కీర్తి సురేష్ బయోపిక్ చేస్తే కచ్చితంగా ఆ టైటిల్ పెట్టినా డౌట్ పడనక్కర్లేదు. ఈమధ్య కెరీర్ లో కాస్త వెనకపడింది కీర్తి సురేష్. పెళ్లి తర్వాత ఈ బ్రేక్ కామనే అయితే మళ్లీ తిరిగి ఫాం లోకి రావాలని చూస్తుంది అమ్మడు.

**విజయ్ దేవరకొండతో రౌడీ జనార్ధన్..** ప్రస్తుతం తెలుగులో విజయ్ దేవరకొండతో రౌడీ జనార్ధన్ తో పాటుగా వేణు యెల్దండి ఎల్లమ్మ సినిమాలో కూడా కీర్తి సురేష్ నటిస్తుంది. ఈ రెండు సినిమాలతో అమ్మడు మళ్లీ తన సత్తా చాటాలని చూస్తుంది. కీర్తి సురేష్ కూడా తన ఫోకస్ అంతా ఇప్పుడు ఈ రెండు సినిమాల మీదే పెట్టింది. తమిళ్ లో సినిమాలు కాస్త తగ్గాయి కాబట్టి అవకాశం ఇస్తున్న తెలుగు లో మళ్లీ రాణించాలని చూస్తుంది అమ్మడు. ఎలాంటి పాత్ర ఇచ్చినా దానికి నూటికి నూరు పాళ్లు న్యాయం చేస్తున్న కీర్తి సురేష్. ఆఫ్టర్ మ్యారేజ్ కూడా తన సత్తా చాటాలని చూస్తుంది. ఐతే ప్రస్తుతం కమిటైన సినిమాలతో కీర్తి సురేష్ చాలా కాన్ఫిడెంట్ గా ఉంది. ఓ పక్క కమర్షియల్ సినిమాలు చేస్తూ ఫిమేల్ సెంట్రిక్ సినిమాలు చేసిన కీర్తి సురేష్. మళ్లీ లేడీ ఓరియెంటెడ్ కథలను కూడా టచ్ చేయాలని చూస్తుంది. ఐతే పూర్తిగా అలాంటి సినిమాలే కాకుండా కమర్షియల్ సినిమాలతో ఆడియన్స్ ని అలరించాలని ఫిక్స్ అయ్యింది. వేణుతో చేస్తున్న ఎల్లమ్మ సినిమాలో కీర్తి సురేష్ రోల్ సర్ ప్రైజ్ చేస్తుందని అంటున్నారు.

